




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 325 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 30 జూలై 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :325 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 30 JULY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# త్వరలోనే యాప్... తప్పు చేసిన వారికి సినిమా చూపించడం ఖాయం

పెన్ పవర్ డెస్క్:తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ) సమావేశంలో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ ఆసక్తికర ప్రకటన చేశారు. త్వరలో పార్టీ తరఫున ఒక మొబైల్ యాప్‌ను తీసుకువస్తున్నామని, ప్రభుత్వ వేధింపులు లేదా అన్యాయాలకు గురైన వారు ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఆయన వెల్లడించారు.జగన్ మాట్లాడుతూ, "త్వరలోనే పార్టీ తరఫున యాప్ విడుదలచేస్తాం. ప్రభుత్వ వేధింపులు జరిగినా, అన్యాయం జరిగినా వెంటనే ఆ యాప్‌లో వివరాలు నమోదు చేయవచ్చు. ఎవరి కారణంగా అయినా అన్యాయంగా ఇబ్బంది పడ్డా, వారిపై ఆ యాప్ లో ఫిర్యాదు చేయొచ్చు... ఆధారాలు కూడా ఆ యాప్‌లో అందించవచ్చు... ఆ ఫిర్యాదు వెంటనే మన డిజిటల్ సర్వర్‌లోకి వచ్చేస్తుంది" అని తెలిపారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు 'రెడ్‌బుక్ రాజ్యాంగం' నడుస్తోందని ఆరోపిస్తున్న నేపథ్యంలో జగన్ ఈ డిజిటల్ ఉద్యమానికి తెర లేపడం గమనార్హం. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'రెడ్‌బుక్' తీసుకొచ్చారని, తప్పుచేసినవారిని వదిలేది లేదని హెచ్చరించారని జగన్ గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ



ఫిర్యాదులపై కచ్చితంగా పరిశీలన చేస్తామని జగన్ స్పష్టం చేశారు. అన్యాయానికి గురైన వారంతా ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, ఆధారాలుగా ఉన్న వీడియోలు, పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. "ఈ ఫిర్యాదులపై పరిశీలన జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. తప్పు చేసిన వారందరికీ సినిమా చూపించడం ఖాయం" అని జగన్ మరోసారి హెచ్చరించారు.

## ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్.. ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు

- ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్
- 2019 తర్వాత ఏపీలో వచ్చిన ప్రభుత్వం నుంచి సహకారం ఆగిపోయిందన్న మంత్రి
- సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని ఆకాంక్షించిన టాన్సీ లెంగ్
- ధన్యవాదాలు తెలుపుతూ.. సింగపూర్ భాగస్వామ్యం విలువైందన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగానే ఆ దేశ మానవనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి టాన్సీ లెంగ్ కీలక ప్రకటన చేశారు. వివిధ రంగాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి వివరాలు 2లో..

## గతంలో పెట్టుబడుల పేరుతో వైసీపీ నేతలు విదేశాల్లో విహార యాత్రలు చేశారు

- సింగపూర్ లో సీఎం చంద్రబాబు బృందం పర్యటన
- రాష్ట్రం కోసం చంద్రబాబు, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్న మంత్రి స్వామి
- చంద్రబాబు అపోలో టైర్స్ కంపెనీ తీసుకువచ్చారని వెల్లడి
- జగన్ ఐదేళ్లలో సైకిల్ ట్యూబ్ కంపెనీ కూడా తీసుకురాలేకపోయారని ఎద్దేవా



పెన్ పవర్ డెస్క్:ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాం జనేయ స్వామి ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం సింగపూర్ పర్యటనపై స్పందించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ వివరాలు 2లో..

## ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశం..

# డీకే శివకుమార్ దూరం!

- అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50 కోట్ల గ్రాంట్ ఇవ్వనున్నట్లు సీఎం వెల్లడి
- నిధుల కేటాయింపుకు సంబంధించి విధానసౌధలో సమావేశం కానున్న ఎమ్మెల్యేలు
- డీకే శివకుమార్ దూరంగా ఉండటంపై కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన

పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలో 'ముఖ్యమంత్రి మార్పు' అంశం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎమ్మెల్యేలతో సమావేశమవుతున్నారు. ఈ భేటీకి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50 కోట్ల గ్రాంట్ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల ప్రకటించారు. ఆ నిధుల కేటాయింపునకు సంబంధించి సిద్ధరామయ్య విధానసౌధలో సమావేశం కానున్నారు. కీలక సమావేశానికి డీకే శివకుమార్ దూరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని కొంతమంది కాంగ్రెస్ నాయకులు వివరాలు 2లో..



## నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం..

# నిండు కుండలా జలాశయం

- శ్రీశైలం నుంచి సాగర్ ప్రాజెక్టుకు 2,01,743 క్యూసెక్కుల వరద నీరు
- ప్రస్తుత సాగర్ కు ఔట్ ఫ్లో 41,882 క్యూసెక్కులు
- ప్రస్తుత సాగర్ నీటి మట్టం 586.60 అడుగులు

పెన్ పవర్ డెస్క్:ఈ ఏడాది కృష్ణానదీ పరివాహక ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటకలలో కురిసిన భారీ వర్షాలకు ముందస్తుగానే జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు జలాశయాలు గత వారంలోనే గరిష్ఠ స్థాయి మట్టాలకు చేరాయి. దీంతో శ్రీశైలం జలాశయానికి అదనంగా వచ్చే వరదనంతా నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలాశయానికి 1,98,920 క్యూసెక్కుల వివరాలు 2లో..



## చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల కలకలంపై పవన్ కల్యాణ్ సమీక్ష



- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల దాడులు
- ఇటీవలే ఏనుగుల దాడిలో ఓ రైతు మృతి
- తిరుపతి శ్రీవారి మెట్టు మార్గం వద్ద ఏనుగుల సంచారం

పెన్ పవర్ డెస్క్:గత కొన్నేళ్లుగా ఏనుగులు అటవీ ప్రాంతాలను వదిలి జనావాసాల్లోకి ప్రవేశిస్తూ, పొలాల్లో పనిచేసుకుంటున్న వారిపై దాడులు చేసి చంపేస్తుండడం తెలిసిందే. ఏపీలోనూ ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. ఇటీవలే చిత్తూరు జిల్లాలో రామకృష్ణంరాజు అనే రైతు ఏనుగుల దాడిలో బలయ్యాడు. నిన్న సోమవారం కూడా తిరుపతి శ్రీవారి మెట్టు మార్గంలో పంప్ హౌస్ వద్ద వివరాలు 2లో..

## ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు..

# అఖిలేశ్ యాదవ్ కు అమిత్ షా కౌంటర్

- ఆపరేషన్ సిందూర్ పై చర్చ సందర్భంగా లోక్ సభలో హోంమంత్రి ప్రసంగం
- తనకు అడ్డుపడుతున్న ప్రతిపక్ష సభ్యులకు కౌంటర్ ఇచ్చిన షా
- పాకిస్థాన్ తో మీరు చర్చలు జరుపుతారా అంటూ ప్రశ్న
- ఆపరేషన్ మహదేవ్ వివరాలను పార్లమెంట్ లో వెల్లడించిన హోంమంత్రి



పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్ లోని పహల్గామ్ లో పర్యాట కులను ఉగ్రవాదులు మతం అడిగి మరీ కాల్చి చంపారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్ సభలో వెల్లడించారు. ఇది అత్యంత దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. ఉగ్రదా డి జరిగిన వెంటనే భద్రతాబలగాలు అప్రమ త్తమయ్యాయని, ఉగ్రవాదుల కోసం వేట ప్రారంభించడంతో పాటు వారు దేశం దాటకుండా ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాయని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పై లోక్ సభలో చేపట్టిన వివరాలు 2లో..

# పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ



- తనపై ఎఫ్ఐఆర్ లు నమోదు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న కిశోర్
- సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు
- పిటిషన్ ను విచారణకు స్వీకరించలేమన్న అత్యున్నత న్యాయస్థానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడు తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తురకా కిశోర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్ ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీం ధర్మాసనం వివరాలు 2లో..

# మోదీ సర్కార్ భద్రతా వైఫల్యమే పహల్గాం ఉగ్రదాడి

పెన్ పవర్ డెస్క్:పహల్గాం ఉగ్రదాడి పూర్తి మోదీ సర్కార్ భద్రతా వైఫల్యమే అన్నారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ. పహల్గాం దాడికి బాధ్యత వహించకుండా.. ఆపరేషన్ సింధూర్ క్రెడిట్ తీసుకుంటోందని విమర్శించారు. పాకిస్తాన్ లో కూర్చొని మనదేశంపై దాడి చేస్తే ఐబీ ఏం చేస్తోందని ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వైఫల్యానికి IB చీఫ్ రాజీనామా చేశాడా?..కేంద్ర హోంమంత్రి రిజైన్ చేశాడా?..ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి కాదా? కనీస బాధ్యత కూడా హోంమంత్రి తీసుకోలేకపోయాడు అని విమర్శించారు ప్రియాంకగాంధీ. పహల్గాం దాడికి ఎవరూ బాధ్యత వహిస్తారో చెప్పాలని కేంద్రాన్ని నిలదీశారు ప్రియాంక గాంధీ. కాశ్మీర్ లో పరిస్థితులు మారిపోయాయని కేంద్ర గొప్పలు చెప్పుకుంటోంది.. నిజంగా మారిపోతే పహల్గాంలో వివరాలు 2లో..



## పాడి కౌశిక్ రెడ్డికి 14 మంది ప్రైవేటు గన్‌మన్‌లతో భద్రత పెంపు!

- ప్రభుత్వం తరఫున ఇప్పటికే నలుగురు గన్‌మన్‌లు
- తాజాగా 14 మంది ప్రైవేటు గన్‌మన్‌లతో మరింత భద్రత
- ఇటీవల ముఖ్యమంత్రిపై విమర్శల నేపథ్యంలో పార్టీ తరఫున భద్రత పెంచిన బీఆర్ఎస్




పెన్ పవర్ డెస్క్:బీఆర్ఎస్ నాయకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైనందున ప్రభుత్వం పరంగా ఆయనకు నలుగురు గన్‌మన్‌లు ఉన్నారు. తాజాగా బీఆర్ఎస్ ఆయనకు అదనంగా మరో 14 మంది ప్రైవేటు గన్‌మన్‌లను నియమించింది.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఆయన విమర్శలకు కాంగ్రెస్ నాయకులు సైతం ప్రతి విమర్శలు చేశారు. ముఖ్యమంత్రిపై ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, ప్రజలు ఉరికించి కొడతారని కూడా కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పాడి కౌశిక్ రెడ్డి పార్టీ తరఫున పెద్ద ఎత్తున సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## మూసీ నది ఆక్రమించి పార్కింగ్ షెడ్లు ...

# తొలగించిన హైడ్రా



పెన్ పవర్ డెస్క్:మూసీ నది ఆక్రమించి నిర్మించిన పార్కింగ్ షెడ్లను తొలగించింది హైడ్రా. మంగళవారం ( జులై 29 ) చాదర్ ఘాట్ బ్రిడ్జి ప్రాంతంలో కూల్చివేతలు చేపట్టారు హైడ్రా అధికారులు. చాదర్ ఘాట్ బ్రిడ్జి నుంచి ఉస్మానియా మార్చురీ వరకు ఉన్న ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో కూల్చివేతలు చేపట్టారు హైడ్రా అధికారులు. మూసి నదిని ఆక్రమించి వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు ఆక్రమణదా రులు.మూసీ నదిలో మట్టి పోసి మరీ షెడ్డులు నిర్మనించి కిరాయికి ఇస్తున్నారు ఆక్రమ ణదా రులు. దీంతో హైడ్రాను ఆశ్రయించి ఫిర్యాదు వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# నల్లారిలో నిరాశ.. ఇక ఇన్నింగ్స్ ముగిసినట్లేనా?

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఎలాంటి పదవులు లేకుండా సాగిపోతున్నారు. ఆయన బీజేపీలో చేరి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ దాదాపు పదేళ్ల నుంచి పదవులకు దూరంగా ఉంటున్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లో పదవులకు దూరంగా ఉండటం కష్టమే. రాష్ట్ర విభజనతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయాలు గ్యాప్ ఇచ్చిగ్యాప్ ఇచ్చి మరీ పార్టీలు మారినా ఫలితం లేకుండా పోతుంది. దీంతో నల్లారి అనుచరులు ఆందోళన చెందుతున్నారు. సొంతపార్టీ పెట్టుకున్నప్పటికీ ప్రజలు ఆదరించలేదు. కాంగ్రెస్ లోకి వెళ్లినా అక్కడా ఎలాంటి పదవులు దక్కలేదు. చివరకు బీజేపీలో చేరి ఎంపీ అవ్వాలన్న కల కూడా నెరవేరలేదు.

**పదేళ్ల నుంచి పదవి లేకుండా...**

2014 నుంచి ఐదేళ్ల పాటు విరామం తీసుకున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ కాంగ్రెస్ కు ఏపీలోనూ, దేశంలోనూ బలోపేతం కాదని భావించిన నల్లారి వెనువెంటనే తన డెసిషన్ ను మార్చుకున్నారు. ఇక తర్వాత బీజేపీలో చేరారు. బీజేపీలో చేరడంతో మాజీ ముఖ్యమంత్రిగా గౌరవించిఆయన కోరుకున్న రాజంపేట లోక్ సభ నియోజకవర్గం సీటు ఇచ్చింది. కానీ కూటమి పార్టీలకు అన్ని చోట్ల విజయం దక్కినా, రాజంపేటలో మాత్రం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఓటమి పాలయ్యారు. రాజంపేటలో ఓటమిని నల్లారి తట్టుకోలేకపోయారు. దీంతో ఆ నియోజకవర్గానికి కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇక ఇదే సమయంలో రాజ్యసభ పదవి అయినా దక్కుతుందని నల్లారి భావించారు.

**బీజేపీలో కనుచూపు మేరలో...**

కానీ బీజేపీ కేంద్ర నాయకత్వం మాత్రం కొత్తగా చేరిన వారికి పదవులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అందులోనూ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి గత ఎన్నికల్లో టిక్కెట్ ఇచ్చినందున ఇక మరో పదవికి ఆయన పేరును పరిశీలనలోకి తీసుకునే ఛాన్స్ కూడా లేదని తెలిసింది. దీంతో ఆయన బీజేపీలో ఉన్నప్పటికీ సైలెంట్ గానే ఉన్నారు. ఎలాంటి పదవి లేకపోవడంతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఎప్పటిలాగానే హైదరాబాద్ కే పరిమితమయ్యారు. అప్పుడప్పుడు బీజేపీ కార్యక్రమాలకు వస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో రాజకీయాలకు ఆయన సిద్ధంగా లేరని తెలుస్తోంది. దీంతో నల్లారిలో నిరాశ ఆవరించింది. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియవు. దీంతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇక రాజకీయాలకు దూరంగా ఉంటే మేలన్న సూచనలు సన్నిహితుల నుంచి వినిపిస్తున్నాయి. అందుకే ఆయన ఏపీ రాజకీయాల గురించి కూడా మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నారట. ఎదురు చూపులు చూడటం తప్ప ఆయన చేయగలిగిందేమీ లేదు.

# గతంలో పెట్టుబడుల పేరుతో వైసీపీ నేతలు విదేశాల్లో విహార యాత్రలు చేశారు

- మొదటి పేజీ తరువాయి

హయాంలో పెట్టుబడుల పేరుతో వైసీపీ నేతలు విదేశాల్లో విహార యాత్రలు చేశారని స్వామి విమర్శించారు. ఫారెన్ ట్రిప్పుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని అన్నారు. రాష్ట్రంలో విధ్వంస పాలన చేసి, సింగపూర్ తో ఏపీకి ఉన్న సత్సంబంధాలను దెబ్బతీశారని మండిపడ్డారు. ఇవాళ చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ఏపీకి పరిశ్రమలు క్యూ కడుతున్నాయని తెలిపారు. చంద్రబాబు రాష్ట్రానికి అపోలో టైర్స్ కంపెనీ తీసుకువచ్చారు... జగన్ తన ఐదేళ్లలో కనీసం సైకిల్ ట్యూబ్ కంపెనీ అయినా తెచ్చారా? అంటూ మంత్రి స్వామి దెప్పిపొడిచారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం... పరిశ్రమలు, పెట్టుబడులతో రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.

# చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఏనుగుల కలకలంపై పవన్ కళ్యాణ్ సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

ఏనుగులు కనిపించాయి. సమీపంలోని పొలాలను ధ్వంసం చేశాయి.

ఈ నేపథ్యంలో, ఏపీ డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. తన శాఖ అధికారులు ఆయన ఇవాళ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏనుగుల గుంపులు పొలాలపైకి రాకుండా, వాటిని అటవీ ప్రాంతంలోకి పంపించే చర్యలను పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఏనుగుల సంచారం ఉండే ప్రాంతాల్లో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తుండాలని, గ్రామస్తులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఏనుగుల తాకిడిపై వారికి ముందుగా సమాచారం అందిస్తుండాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఏనుగుల ప్రభావిత గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

### నాగార్జున సాగర్ కు భారీగా వరద ప్రవాహం..

# నిండు కుండలా జలాశయం

- మొదటి పేజీ తరువాయి

మేర వరద పెరగడంతో నిన్న నాలుగు గేట్లు పది అడుగుల మేర ఎత్తి 1,08,260 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 66,896 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నాగార్జునసాగర్‌కు 2,01,743 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రస్తుతం సాగర్ ఔట్ ఫ్లో 41,882 క్యూసెక్కులుగా నమోదైంది. ఈరోజు ఉదయం గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తుండటంతో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నదిలోకి వెళ్లవద్దని సూచించారు.సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 586.60 అడుగుల నీటి మట్టం ఉంది. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.4 టీఎంసీలకు చేరుకోవడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్‌కు భారీ వరద కొనసాగుతోంది.

### మూసీ నది ఆక్రమించి పార్కింగ్ షెడ్లు ...

# తొలగించిన హైడ్రా

- మొదటి పేజీ తరువాయి

చేశారు స్థానికులు. స్థానికుల ఫిర్యాదుతో రంగం లోకి దిగిన హైడ్రా సుమారు పది ఎకరాల స్థలంలో ఆక్రమణలు తొలగించింది. కబ్జా చేసినవారంతా అక్కడ షెడ్లు వేసి, వాటికని బస్సులు, లారీల పార్కింగ్ కోసం అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు అధికారులు.కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. తికారం అనే వ్యక్తి మూడు ఎకరాలు, పూనమ్ చాంద్ యాదవ్ అనే వ్యక్తి ఎకరం 30 గుంటలు, జయకృష్ణ అనే వ్యక్తి 5 ఎకరాల 22 గుంటలు కబ్జా చేసినట్లు తెలిపారు హైడ్రా అధికారులు. ఆక్రమణలు తొలగించిన అధికారులు మళ్ళీ కబ్జాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశం.. డీకే శివకుమార్ దూరం!

- మొదటి పేజీ తరువాయి

చెబుతుండగా, ఇదేం కొత్త కాదని అధికార వర్గాలు తెలిపాయి. గతంలోను తన పదవీ కాలంలో పలు సమావేశాలకు ఆయన దూరంగా ఉన్నారని చెబుతున్నారు. డీకే శివకుమార్ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, అందుకే ఆయన సమావేశానికి హాజరుకాలేకపోతున్నారని మరికొందరు అంటున్నారు.

సాధారణంగా ఇలాంటి సమావేశాలు కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయాల్లో జరుగుతాయి. ఈసారి విధానసౌధలో ముఖ్యమంత్రి ఛాంబర్‌లో నిర్వహిస్తున్నారు. డీకే శివకుమార్‌ను దూరం పెట్టడానికే విధానసౌధలో ఈ సమావేశం జరుగుతోందనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

# మోదీ సర్కార్ భద్రతా వైఫల్యమే పహల్గాం ఉగ్రదాడి

- మొదటి పేజీ తరువాయి

ఉగ్రదాడి ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. భార్య చూస్తుండగానే భర్తను దారుణంగా చంపేశారు. ఉగ్రదాడిని ముందే గుర్తించేంత ఇంటెలిజెన్స్ వ్యవస్థ లేదా?..పహల్గాం ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ వైఫల్యం అవునా కాదా? అని మోదీ సర్కార్ ను నిలదీశారు. గెలుపైనా ఓటమైనా బాధ్యత తీసుకోవడం గొప్పతనం.. కేంద్రం బాధ్యతతీసుకోకుండా TRF పై తోసేసిందన్నారు ప్రియాంకగాంధీ.

అధికార పార్టీకి జనంపై ధ్యాస లేదు. అన్ని రాజకీయాలే చేస్తోందన్నారు ప్రియాంకగాంధీ. దేశంలో చెలరేగిన హింసాకాండను,అల్లర్లను కట్టడి చేయడంతో హోంమంత్రి అమిత్ షా పూర్తిగా విఫలమయ్యారన్నారు.మణిపూర్, ఢిల్లీతో సహా దేశంలో అల్లర్లను కట్టడి చేయడంతో హోంమంత్రి విఫలమయ్యారని విమర్శించారు. యుద్ధాన్ని ఆపాలని అమెరికా అధ్యక్షుడు ఎలా చెప్తారు..పాక్ ఆర్మీ జనరల్ వైట్ హౌస్ లో ట్రంప్ తో లంచ్ మర్మమేంటనని కేంద్రాన్ని నిలదీశారు ప్రియాంకగాంధీ. పహల్గాం ఉగ్రదాడి బాధితుల తరపున నేను మాట్లాడుతున్నా..అధికార పార్టీకి ప్రజలపై ధ్యాస లేదు..అన్ని రాజకీయాలే చేస్తోంది. ఎన్డీయే పాలనలో పబ్లిసిటీ తప్పా .. పాలన లేదని.. మోదీ సర్కార్ ఎన్ని ఆపరేషన్లు చేసినా.. నిజాన్ని దాచలేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ తీవ్రంగా విమర్శించారు.

### ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు..

# అఖిలేశ్ యాదవ్ కు అమిత్ షా కౌంటర్

- మొదటి పేజీ తరువాయి

చర్చలో హోంమంత్రి అమిత్ షా ఈ రోజు మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టినట్లు వివరించారు.

ఈ నెల 22న ఉగ్రవాదుల ఆచూకీ తెలిసిందని, దాచిగామ్ సమీపంలోని మహదేవ్ కొండల్లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో మహదేవ్ కొండల్లో గాలింపు చర్యలు చేపట్టి పహల్గామ్ ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్ షా తో పాటు ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు హతమార్చాయని వివరించారు. ఈ క్రమంలోనే తన ప్రసంగానికి పదే పదే అడ్డువస్తున్న ప్రతిపక్ష ఎంపీలకు అమిత్ షా చురకలంటించారు. సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ను ఉద్దేశించి.. 'ఉగ్రవాదుల మతం చూసి బాధపడొద్దు' అంటూ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ ను వెనకేసుకు వస్తే మీకు ఏమొస్తుందంటూ ప్రతిపక్ష ఎంపీలను నిలదీశారు. పాకిస్థాన్ తో మీరు చర్చలు జరుపుతారా అని నిలదీశారు. కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఇటీవలి వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. పాక్ ను రక్షిస్తే మీకు ఏమొస్తుందని ప్రశ్నించారు. ఉగ్రవాదులు పాకిస్థాన్ కు చెందిన వారేనని తాము వెల్లడిస్తే ఆధారమేంటని చిదంబరం ప్రశ్నిస్తున్నారని షా గుర్తుచేశారు. ఉగ్రవాదుల దగ్గర పాకిస్థాన్ లో తయారైన చాక్లెట్లు దొరికాయని షా తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు పాకిస్థాన్ ను ఎందుకు వెనకేసుకు వస్తున్నారని హోంమంత్రి నిలదీశారు.

పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెడితే దేశ ప్రజలతో పాటు ప్రతిపక్ష నేతలూ హర్షం వ్యక్తం చేస్తారని తాము భావించినట్లు అమిత్ షా పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం ప్రతిపక్ష ఎంపీల ప్రశ్నలు, చర్చలో వారి ప్రవర్తన చూస్తుంటే ఉగ్రవాదులను తుదముట్టించడం వారికి ఎలాంటి సంతోషాన్ని కలిగించలేకపోయినట్లు తెలుస్తోందని అమిత్ షా ఆరోపించారు.

# ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామిగా ఉంటుందన్న మంత్రి టాన్సీ లెంగ్.. ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

సంసిద్ధతను వ్యక్తం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ విధానాలను ప్రస్తావిస్తూ ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రి చేసిన ప్రకటన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యంగా ఉండేందుకు సిద్దంగా ఉందని ఆ దేశ ట్రేడ్ ఇండస్ట్రీ శాఖలోని మానవ వనరులు, శాస్త్రసాంకేతిక మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంపై 'ఎక్స్' (ట్విట్టర్) హ్యాండిల్ లో పోస్టు చేసిన ఆయన ఏపీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం లాంటి రంగాలు పెట్టుబడులకు అనుకూలమని టాన్సీ లెంగ్ పేర్కొన్నారు. భారత్ లో అత్యంత వేగంగా ఎదుగుతున్న రాష్ట్రాల్లో ఒకటైన ఏపీలో ఫుడ్ ఎంపైర్, ఎవర్ వోల్ట్ లాంటి సింగపూర్ కంపెనీలు ఇప్పటికే పెట్టుబడులు, కార్యకలాపాల విస్తరణకు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. అలాగే పోర్టులు, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులతో పాటు భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్టు మంత్రి టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. మరోవైపు 2014-2019లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి నాటి ప్రభుత్వంతో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పన, నిర్మాణ సహకారాన్ని అందించినట్టు తన ట్వీట్ లో పేర్కొన్నారు. అమరావతిలో స్టార్టప్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సింగపూర్ కంపెనీలు స్విస్ ఛాలెంజ్ విధానంలో టెండర్ కూడా దక్కించుకున్నాయని గుర్తు చేశారు.

అయితే, 2019లో ప్రభుత్వం మారిన తర్వాత ఈ సహకారం ఆగిపోయిందని అన్నారు. సింగపూర్ కన్సార్టియం కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చేసిందని టాన్సీ లెంగ్ తన పోస్టులో పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబుతో సమావేశమై ఏపీ అభివృద్ధిపై చర్చించినట్టు ఆయన వెల్లడించారు. సీడ్ క్యాపిటల్ విషయంలో సింగపూర్ కన్సార్టియం పనిచేయకున్నా.. ఏపీలో పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో సాంకేతిక సహకారం అందించటంతో పాటు ప్రపంచబ్యాంకు లాంటి భాగస్వాములతో కలిసి ఏపీ అభివృద్ధి ప్రణాళికల్లో కలిసి పనిచేస్తామని టాన్సీ లెంగ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రుల బృందం సింగపూర్ పర్యటన ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్టు సింగపూర్ మంత్రి తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం విలువైంది: సీఎం చంద్రబాబువివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలియచేశారు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి, ఆ దేశ మంత్రి టాన్సీ లెంగ్ కు 'ఎక్స్' వేదికగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. వివిధ రంగాల్లో ఏపీ-సింగపూర్ కలిసి పనిచేయడానికి టాన్సీ లెంగ్ తో జరిపిన చర్చలు బాటలు వేశాయని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఈ చర్చలు దోహద పడతాయన్నారు. 90వ దశకం నుంచి సింగపూర్ ప్రభుత్వంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం చాలా విలువైందని సీఎం చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

ఏపీ అభివృద్ధి ప్రయాణంలో.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి సహకారం ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీలో అద్భుతమైన ప్రజా తీర్పుతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా అడుగులు వేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. వివిధ రంగాల్లో సింగపూర్ దేశ విధానాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు. పట్టణ, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వేసుకున్న ప్రణాళికలకు సింగపూర్ తోడైతే ప్రజల ఆశలను నెరవేర్చగలమని సీఎం చంద్రబాబు తన ట్వీట్ లో ఆకాంక్షించారు.

# పిన్నెల్లి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి

నిరాకరించింది. తనపై ఇక మీదట ఎలాంటి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కిశోర్ రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక తనపై 9 కేసులు నమోదు చేశారని, ఇంకా మరికొన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేయనున్నారని కిశోర్ తన పిటిషన్ లో పేర్కొన్నాడు. అయితే, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం అతడి పిటిషన్ ను డిస్మిస్ చేసింది. మాచర్ల మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిశోర్ గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలపై దాడికి పాల్పడిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కనిపించాయి. అతడిపై అనేక ఆరోపణలతో కేసులు నమోదయ్యాయి. వాటిలో మూడు హత్యాయత్నం కేసులు కూడా ఉన్నాయి. ఎన్నికల ఘటనల నేపథ్యంలో, పిన్నెల్లి బ్రదర్స్ అజ్ఞాతంలోకి వెళ్లగా, వారి అనుచరులు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో, మల్కాజిగిరి జైపురి కాలనీలో తురకా కిశోర్ ను పోలీసులు ఈ ఏడాది జనవరిలో అరెస్ట్ చేశారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు





### శరవేగంగా
## గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టండి.. అపోహాలను నమ్మవద్దు**

**సంక్షేమ పాలనలో రాష్ట్రానికి ఆదర్శంగా చంద్రబాబు నాయకత్వం : మంత్రి సుభాష్**

**కాజులూరు, పెన్ పవర్, జూలై 29:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటుట్కయి కేవలం ఏడాదే పూర్తైన వేళ, సంక్షేమ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం కాజులూరు మండలంలోని తిప్పరాజుపాలెం, అయితపూడి గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 5వ తేదీ నుంచి గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు పనులు శర వేగంగా ప్రారంభం కానున్నాయి అని తెలిపారు. ప్రతిపక్షాలు అభివృద్ధిని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, అలాంటి అపోహాలను ప్రజలు నమ్మవద్దని మంత్రి హెచ్చరించారు. ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టాలని కూటమి నాయకులకు సూచించారు. తిప్పరాజుపాలెం గ్రామంలో అంగన్వాడి భవనం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన మంత్రి, అయితపూడిలో ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను తక్షణమే పరిష్కరించా లంటూ అధికారులనుఆదేశించారు. అదే గ్రామంలో ఇళ్ల పట్టాల సమస్యపై ఎమ్మార్వోకు సూచనలు ఇచ్చారు. గ్రామానికి చెందిన టీచర్ లక్ష్మీకి అదే గ్రామంలో డిప్యూటేషన్ ఇచ్చేలా విద్యాశాఖను ఆదేశించారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో మంత్రి స్వయంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మంత్రిగా కాకుండా సామాజిక నాయకుడిగా తన బాధ్యతను నిర్వర్తిస్తూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి ఎన్నికల్లో ఓడిపోయినా, “రీకాల్ చంద్రబాబు” వంటి రాజకీయ నాటకాలపై సుభాష్ ఘాటు విమర్శలు చేశారు. “వైకాపా గతంలో దందాలు, అరాచకాలతో ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. ఇప్పుడు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తోంది,” అంటూ ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా పెనుమల్ల సొసైటీ నూతన అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వరరావు ఇచ్చిన ఆతిథ్యాన్ని మంత్రి స్వీకరించారు. అయితపూడి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి మాచగిరి సువర్ణ కుమార్‌కు హాస్టల్ సీటు ఇప్పించేందుకు మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిప్పరాజుపాలెం సర్పంచ్ యాళ్ల అచ్చమాంబ, అయితపూడి సర్పంచ్ పెద్దిరెడ్డి చంద్రరావు, కొల్లు వెంకటేశ్వరరావు, వల్లు అర్జునరావు, టిడిపి మండల అధ్యక్షులు డాక్టర్ బాబు, మేడిశెట్టి పెద్ద, రెడ్డి శేషారావు, పేపకాయల బాబ్జి, ఎస్సై మోహన్ కుమార్,కార్యదర్శులు, జహంగీర్, మోహన్,వీఆర్వోలు, కట్టా, వరలక్ష్మి సచివాలయ సిబ్బంది, అనుబంధ సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు. “ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం ప్రజల గుండెల్లో స్థానం సంపాదించింది. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది,” అని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.

## జగన్‌ను కలిసిన శ్రీకృష్ణ



**మండపేట. పెన్ పవర్.జూలై 29:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మండపేట నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్ చోడే శ్రీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగం ద్వారా చేస్తున్న కార్యక్రమాలు గూర్చి ఏపీ సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వివరిం చగా జగన్ ప్రత్యేకంగా అభినందించారని శ్రీకృష్ణ ఆనందం వ్యక్తంచేశారు. యువజన విభాగం బలోపేతానికి కృషిచేయాలని సూచించారన్నారు. మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్టు శ్రీకృష్ణ తెలిపారు.

# విద్యుత్తు సరఫరా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి

**కలెక్టర్ మహేష్ కుమార్**





**అమలాపురం పెన్ పవర్ జూలై 29:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరి పాలన అందించాలనే నేపథ్యంలో రోజువా రీగా సేకరిస్తున్న (పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్) ప్రజా సంతృప్తి స్థాయిలలో విద్యుత్ సరఫరా కూడా ఒక ప్రధాన అంశంగా ఉందని ఆ దిశగా విద్యుత్ సమస్యలపై ఏపీ ఈపీడీసీఎల్ ఇంజనీర్లు ప్రత్యేక ఫోకస్ పెట్టి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా జిల్లాలో లోవోల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు ఏపీఈపి డిసిఎల్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి, జిల్లాలో మండలాల వారిగా విద్యుత్ సరఫరాలో సమస్యలు పరి ష్కారంపై తీసుకుంటున్న చర్యలపై ఆయన సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి లోవోల్టేజ్, పవర్ కట్, సమస్యలు పట్ల ఫిర్యాదులు వస్తున్నాయని నాణ్య మైన విద్యుత్ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకై, వినియోగదారుల కొరకు ప్రత్యేక విభాగం ద్వారా విద్యుత్ సరఫరా, ఆక్వా కమర్షియల్ రంగాలకు ప్రత్యేక సెక్షన్లుగా విభజించు కోవాలని సూచించారు. లేనిపక్షంలో కమర్షియల్‌గా ఎక్కువగా విద్యుత్ లోడ్ ఉండడం వల్లలో వోల్టేజ్ సమస్యలు ఉత్పన్నమై గృహ వినియోగదారుల గృహెూపకరణాలు చెడిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. పొడవైన విద్యుత్తు లైను కొబ్బరి తోటలు మూలంగా తరచుగా విద్యుత్తు అంతరాయాలు ఎదుర వుతాయని అలా కాకుండా ఎక్కడికక్కడ సబ్ స్టేషన్‌ల వారిగా లైన్లో విభజించి సరఫరా చేయాలని సూచించారు. రీవేంపడు డిస్ట్రిబ్యూషన్ సెక్షనల విధానం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలన్నారు. సీజన్ల వారీగా విద్యుత్ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. లోవోల్టేజ్ పవర్ కట్ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రస్తుతం ఉన్న ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ నీ పెంచాలని,పవర్ డిస్ట్రిబ్యూషన్ విద్యుత్తు లైన్ల నవీకరించాలని ఆదేశించారు. సబ్ స్టేషన్లు వారిగా విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టాలని సూచించారు. ఆగస్టు నెలాఖరు నాటికి విద్యుత్ సమ స్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని ఆదేశిం చారు. విద్యుత్ ఉప కేంద్రాలు పెంచడానికి చర్యలు తీసు కోవాలన్నారు పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్షిస్తూ ఎస్సీ ఎస్టీలకు యూనిట్ల ఏర్పాట్లు ప్రత్యేక చొరవ తీసుకుని యూనిట్ల ఏర్పాటుకు ఏజెన్సీలను నియమించాలని ఆదేశించారు. దశలవారీగా ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా యూని ట్లను నెలకొల్పాలని ఆదేశిం చారు. పురపాలక సంఘాలలో కార్యాలయాలు పుర పాలక పాఠశాలలు, వీధి లైట్లు పార్కులలో విద్యుత్ వినియోగానికి సంబం ధించి ఒక చోట యూనిట్ను కౌన్సిల్ తీర్మానంతో ఆమోదించి బ్యాం కర్ల సమన్వయంతో రుణం తీసుకుని అనువైన ప్రాంతంలో పెద్ద యూనిట్లను స్థాపించాలని ఆదేశించారు. నాలుగు సంవత్స రాలలో బ్యాంకు ఋణం తీరి యూనిట్ సొంతం అవు తుందన్నారు. ఆ దిశగా మండపేట కార్యాచరణ సిద్ధం చేసిందని, రామచంద్రపురం, అమలాపురం, పురపాలక సంఘాలు యూనిట్ల ఏర్పాటుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీఈపీ డీసీఎల్ ఎస్ఇబి రాజేశ్వరి, డివిజన్ మండల వారి ఇంజనీర్లు పాల్గొన్నారు.

# వరద ముంపులో గండి పోచమ్మ తల్లి ఆలయం

**భక్తులకు దర్శనాలు నిలిపివేత... అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఎదురుచూపులు**





**దేవీపట్నం,పెన్ పవర్,జులై29:** దేవీపట్నం మండలం గొందూరు గ్రామంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం గోదావరి ఉగ్రరూపం కారణంగా ముంపునకు గురైంది.గోదావరి నీటి మట్టం పెరగడంతో ఆలయం పరిసరాలు పూర్తిగా నీటమునిగిపోగా గోపురం మాత్రమే పైభాగంలో కనిపిస్తోంది.ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో వేలాదిమంది భక్తులు తల్లి దర్శనం కోసం తరలివస్తుంటారు. కుటుంబ శ్రేయస్సు,సంతాన సాఫల్యం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించే ఈ ఆలయం ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది.అయితే ప్రస్తుతం వరదనీరు పెరగడంతో,దర్శనాలు తాత్కాలికంగా లిపివేయబడ్డాయి.పాపికొండల బోటు ప్రయాణాలు,రోడ్డు మార్గాల రాకపోకలు నిలిపివేయడంతో భక్తులు దర్శనాల కోసం ఆరాటపడుతున్నారు.వరదల ప్రభావం నిరంతరంగా ఉండటంతో భవిష్యత్తులో ఆలయాన్ని రక్షించేందుకు దేవదాయశాఖ,రక్షణ గోడ నిర్మాణం,అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.గోదావరి ఒడ్డున ప్రకృతి ఒడిలో ఉన్న గండి పోచమ్మ తల్లి ఆలయం వరద ముంపుతో భక్తులను కలవరపరుస్తూ దర్శనం కోసం ఎదురుచూస్తోంది.

# రంపచోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి స్వాధీనం..

- తాళ్లపాలెం వద్ద వాహన తనిఖీల్లో బొలెరో వాహనంలో గంజాయి పట్టివేత..
- 1142 కిలోల గంజాయి, విలువ కోటి 15 లక్షలు స్వాధీనం..
- నలుగురు అరెస్ట్,రిమాండ్‌కు తరలింపు





**దేవీపట్నం,రంపచోడవరం,పెన్ పవర్,జూలై29:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేశారు.ముందస్తు సమాచారం ఆధారంగా తాళ్లపాలెం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు.ఈ దాడిలో పోలీసులు ఒక బొలెరో వాహనం,ఒక ద్విచక్ర వాహనం, సుమారు 1142 కిలోల గంజాయి(విలువ సుమారు కోటి పదిహేను లక్షలు)స్వాధీనం చేసుకున్నారు.నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ సాయి ప్రశాంత్ తెలిపారు.ఈ ఆపరేషన్‌లో ఎస్సై వెంకట్రావు,ట్రైనింగ్ ఎస్సై సహకరించారు.

## విశ్రాంతి ఉపాధ్యాయలు ఆనందరావు

### రూ.50 వేల విద్యా సామగ్రి పంపిణీ




**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 29:** ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఆ ఉపాధ్యాయుడు విద్యార్థులకు రూ.50 వేలు విలువ చేసే విద్యా సామాగ్రిని తన స్వచ్ఛంద సంస్థ ద్వారా పంపిణీ చేసారు. పుల్లేటికుర్రు కు చెందిన కత్తుల ఆనందరావు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి విజయానంద స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు.ఆ సంస్థ ద్వారా మంగళవారం పుల్లేటికుర్రు పంచాయతీ పరిధిలోని నెహ్రూ నగర్, పుల్లేటికుర్రు మెయిన్, చీకట్ల వారి పేట, వ్యాఘ్రేశ్వరం, కొల్లి వారి పేట, కడలివారిపాలెం పాఠశాలలకు చెందిన 143 మంది విద్యా ర్థులకు వ్రాత పుస్తకాలు, పలకలు, పరీక్ష అట్టలు రూ.50 వేలు విలువ చేసే విద్యాసా మాగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా డిసిఇబి సెక్రెటరీ అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు, ఎం.ఈ.ఓలు, కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్‌లు పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేసారు.ఆయా పాఠశాలల హెచ్.ఎం.లు గుబ్బల శ్రీనివాసరావు, డి.వి.నారాయణ, పుల్లేటికుర్రు క్లస్టర్ జాయింట్ సెక్రెటరీ కె.వి.ఎస్ కుమార్, ఎస్ ఎం సి. చైర్మన్ ఎస్.వీరవేణి,ఉపాధ్యాయులు వి. వరలక్ష్మి, కే. భూలక్ష్మి,వై. ప్రియాంక విద్యార్థుల తల్లి తండ్రులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎర్రగుంట అయ్యప్ప



**మండపేట. పెన్ పవర్. జూలై 29:** వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండపేట కు చెందిన ఎర్రగుంట మణికంఠ కుమార్ (అయ్యప్ప) నియమితులయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి, మండపేట నియోజక వర్గ వైసిపి ఇన్ ఛార్జ్, ఎమ్మెల్సీ, రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ చైర్మన్ తోట త్రిమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇచ్చిన ఈ బాధ్యతను 2029లో పార్టీని అధికారులు తీసుకురా వడానికి శాయశక్తుల కృషిచేస్తా నని చెప్పారు. ఈయన నియామ కంపట్ల వైసిపి అర్‌టిఐ విభాగం చైర్మన్, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీ వైష్ణవి కనకదుర్గ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం



**కె గంగవరం పెన్ పవర్ జులై 29:** మండల కేంద్రమైన కె గంగవరం గ్రామంలో దంగేరు సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ వైష్ణవి కనకదుర్గ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు మంగళవారం నాడు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాయి.ఈ సందర్భంగా ఆలయాన్ని పచ్చి పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు వైభవంగా అలంకరణ చేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు పులిహోర ప్రసాదాన్ని భక్తులకు విరివిగా పంపిణీ చేశారు.



గిరిజన గ్రామాల రోడ్లు...పేరుకే పథకాలు..
వర్షం పడితే మార్గమే మాయం.. గర్భిణీకి ఆసుపత్రి దారి లేదు...
విద్యార్థికి స్కూల్ ప్రయాణమే సవాలు..ఎన్నికలలో మాటలు-ఏడాదంతా మౌనం..
ప్రతినిధుల పర్యటనలు-ఫొటోకే పరిమితం..
రోడ్డుకి రెక్కలొస్తేనే బతుకుకి ఊపిరి.. ఇప్పటికైనా మారాలి-మార్గం చూపాలి..
ఓటు వేసిన గిరిజనుడికి దారి ఎందుకు లేదు...

**గిరిజన ప్రజల ఆవేదన..**

# బాట బాగుంటే.. బతుకు బాగుంటుంది!

**దేవీపట్నం,పెన్ పవర్,జూలై29:** దేవీపట్నం మండలంలోని కూటకరాయి,మద్దిరాతిగూడెం తదితర గిరిజన గ్రామాల్లో రహదారుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వర్షాకాలం వచ్చిన వెంటనే రహదారులు మాయమైపోతూ, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని స్థితి,గర్భిణీలు ఆసుపత్రికి చేరలేని అవస్థ,వృద్ధులు ఇంటి ముందుకు కూడా రావలేని బాధలను గిరిజనులు నిత్యం ఎదుర్కొంటున్నారు. సంవత్సరాలుగా మారిన ప్రభుత్వాలు,వచ్చిపోయిన ప్రజాప్రతినిధులు ఎన్నో హామీలు ఇచ్చినా,ఈ మార్గాల తీరుతో మాత్రం ఎలాంటి పరిష్కార చర్యలు కనిపించలేదు.గ్రామీణ అభివృద్ధి పేరిట నిధులు మంజూరు అయినప్పటికీ,పనులు మట్టిలోనే మగ్గిపోయాయి.ఈ పరిస్థితుల్లో తక్షణంగా సంబంధిత శాఖలు,ప్రజాప్రతినిధులు గ్రామాలను ప్రత్యక్షంగా సందర్శించి,శాశ్వత రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోకపోతే గిరిజన జీవితం మరింత ప్రమాదంలో పడుతుంది.ఇది కేవలం రహదారి సమస్య కాదు,గ్రామాల ఉనికి,అభివృద్ధి,బతుకు బవసిర్‌గా మారిన మానవతా విజ్ఞప్తి.కనీస మౌలిక వసతులుగా ఉండాల్సిన రహదారులు లేకపోవడం వల్ల ప్రతి అడుగు ఓ ప్రాణాపాయం గా మారుతోంది. అందుచేత,గిరిజనుల పట్ల నిజమైన నిబద్ధత



కలిగి ఉన్న పాలకులు,అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యపై పునరాలోచించాలి.ఇది ఓటు కోసం వినాల్సిన మాట కాదు...జీవన హక్కుగా గుర్తించి మార్గం చూపాల్సిన దశ వచ్చింది.





## వరలక్ష్మి వ్రతానికి మహిళలకు సువర్ణ అవకాశం

### రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు

**గంగవరం ,పెన్ పవర్, జూలై 30:** శ్రావణ మాసం సందర్భంగా వరలక్ష్మి వ్రతానికి మహిళలకు సువర్ణ అవకాశం కలిపిస్తున్నట్లు విశ్వహిందూ పరిరక్షణ రామ సేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. గంగవరం మండల పరిధిలోని గ్రామాలలో మహిళలకు వచ్చే నెల నాలుగో తేదీ సోమవా రం అడ్డతీగల కేంద్రంగా లక్కీ డ్రా ద్వారా 25 మంది మహిళలకు ఒక్కొక్కరికి ఒక గ్రామ బంగారం రూపు ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని గంగవరం మండల గ్రామాలలోని మహిళలు సద్వినియోగం చేసుకో వాలని, అందుకోసం మండల పరిదిలోని అయా గ్రామాలలో పేర్లు నమోదు చేయడం జరుగు తుందన్నారు. పేరు నమోదు కొరకు విశ్వహిందూ పరిరక్షణ విశ్వహిందూ పరిరక్షణ రామసేన కార్యకర్త కడబాల సుధ ను(o91 86392 16708) సంప్రదించగలరని గంగవరం మండలం విశ్వ హిందూ పరిరక్షణ రామసేన కార్యకర్త కడబాల సుధ తెలిపారు.

## నిరుపేదల పాలిట సంజీవినిగా ముఖ్యమంత్రి సహాయ నిధి

### 31 మందికి రూ. 29.61 లక్షల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి సుభాష్



**కె గంగవరం పెన్ పవర్ జూలై 29:** నిరుపేదలకు అనా రోగ్య సమయాలలో సంజీవినిగా ముఖ్యమంత్రి సహాయ నిధులు (సీఎంఆర్ఎఫ్) దోహదపడుతు న్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 31 మంది నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయనిధి నుండి రూ. 29 లక్షల 61 వేల 567 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఒక నిధని, నిరు పేదలకు, ప్రకృతి వైపరీత్యాల బాధితులకు, వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడే పేదలకు, అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే పథకమన్నారు. ఈ నిధిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్లకార్డుదారులు కలిగిన వారు సద్వినియోగం చేసుకో వచ్చునన్నారు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలు,ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో లేని చికిత్సలు అవసరమైనవారు ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు ప్రజా ప్రతినిధుల సిఫార్సుతో ఈ ఆర్థిక సహాయం వైద్య ఖర్చులు నిమిత్తం పొంద వచ్చునన్నారు. ఈ కార్య క్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## జొన్నాడలో చైర్మన్లు, డైరెక్టర్లకు అభినందన సత్కారం

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 29:** మండలంలోని జొన్నాడ ఎస్సీ కాలనీలో పలువురు చైర్మన్లుకు, డైరెక్టర్లకు మంగళవారం స్థానిక ఎఫ్ఎల్సిఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఇందులో స్థానిక సొసైటీ చైర్మన్ మేడపాటి రామారెడ్డి, శివాలయం ట్రస్ట్ చైర్మన్ దమ్ము సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్లు నామాల సూరిబాబు, చింతలపూడి శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు రేలంగి కొండయ్య, యాళ్ళ చంద్రశేఖర్‌లకు పెద్ద ఎత్తున ఎస్సీ నాయకులు హాజరై పూల మాలలు వేసి దుస్సాలువాలు కప్పి అభినందించి సన్మానించారు. అలాగే రైతుల అభ్యున్నతికి ఆలయాల పటిష్టతకు ఆయా చైర్మన్లు, డైరెక్టర్లు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్లు, డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రభుత్వం మా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా చూసుకుంటామని అన్నారు. అలాగే మాకు ఈ పదవులు రావడానికి విశేషమైన కృషి చేసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బండారు శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు వారంతా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి(బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్(బాబి), అయినవిల్లి సత్తిబాబు గౌడ్, భావన శ్రీనివాస్, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, ఎఫ్ఎల్సిఎస్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీకి ఎమ్మెల్యే చిరి ఎంపిక



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూలై 29:** పోలవరం శాసనసభ్యులు సిరి బాలరాజు రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీ సభ్యునిగా ప్రభుత్వం ద్వారా నియమితులైనట్లు మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివాసి సమాజ అభివృద్ధికి నేను నిరంతరం కట్టుబడి వ్యక్తిని, వ్యక్తిగత గౌరవంగా కాదని బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు .ఇది పోలవరం ప్రజల విజయమని అన్నారు. రాష్ట్ర స్థాయి లో గిరిజనుల సమస్యలను హక్కులను ప్రభుత్వానికి నేరుగా వినిపించే అవకాశం ఈ వేదిక ద్వారా లభించిందని అన్నారు. ఇప్పటివరకు పోలవ రం నియోజకవర్గంలో గిరిజనుల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసినందుకు ఈ పదవి లభించిందని అన్నారు. రాష్ట్రంలో ఆదివాసి సమాజానికి ప్రాముఖ్యత కలిగించేలా ఉందని అన్నారు. ఈ నియామకం ఆయన సామాజిక చింతనకు మరో గుర్తింపుగా నిలిచిందని అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీ మెంబర్గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కి అభినందనలు తెలిపారు.

## 60 ఏళ్ల పైబడిన వారికి ఇంటింటికి రేషన్ పంపిణీ



**దేవీపట్నం,పెన్ పవర్,జూలై29:** ఎన్నికల హామీల మేరకు కూటమి ప్రభుత్వం 60 సంవత్సరాల పైబడిన లబ్ధిదారులకు ఇంటింటికి రేషన్ బియ్యం అందజేస్తుందని రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు.దేవీపట్నం మండలంలోని ఇందుకూరు పంచాయతీ, ఎం.రావిలంక గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికా రులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ బియ్యం అందజేశారు.ఈ నిర్ణయం తో వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి శివరామకృష్ణతో పాటు నీటి సంఘం అధ్యక్షులు గంగరాజు,సేల్స్ మెన్ జ్యోతి,వెంకటేశ్వరరావు, సూర్యకాంతం,మాదీనా బీబీ,తదితరులు పాల్గొన్నారు.




# అసత్య ప్రచారాలు మానుకోవాలి: కూటమి నేతల హెచ్చరిక

## చిర్ల జగ్గిరెడ్డి వంటి అనుభవజ్ఞులు వాస్తవాలను వక్రీకరించడం బాధాకరం

**ఆత్రేయపురం,పెన్ పవర్ జూలై 29:** వైఎస్సార్ జిల్లా మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి వాస్తవాలకు విరుద్ధంగా అసత్యాలను ప్రసారం చేస్తున్నారని కూటమి నేతలు మండిపడ్డారు. సోమవారం ఆయన ఆత్రేయపురం మండలంలో పర్యటించిన సమయంలో చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఆత్రేయపురం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు ఇంటి వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లోమండల టీడీపీ అధ్యక్షు డు కుసంపూడి రామకృష్ణంరాజు, ముదునూరి వెంకటంరాజు, కరుటూరి నరసింహారావు మాట్లాడారు. "చిర్ల జగ్గిరెడ్డి వంటి అనుభవజ్ఞులు వాస్తవాలను వక్రీకరించడం బాధాకరం. వారి హయాంలోనే చీఫ్ నికర్ వ్యవహారంలో అవినీతి జరిగింది. డిజిటల్ లావాదేవీలను పక్కనబెట్టి నగదు వసూలు చేసి షాపులు నడిపించారు. తాడేపల్లిలోని అధికార నివాసానికి నేరుగా డబ్బులు వెళ్లిన వాస్తవాలు ప్రజలకు తెలిసిందే," అని తెలిపారు.

విజిలెన్స్ అధికారులు గోపాలపురంలో ఇసుక అక్రమాలపై దాడులు నిర్వహించడం, తిరుపతిలో టిక్కెట్ల కుంభకోణం వంటి ఘటనలను ప్రస్తావించిన వారు, "ప్రతిపక్షాలు తట్టుకోలేక అసత్య ప్రచారాలకు దిగుతున్నాయి" అని వ్యాఖ్యానించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. సూపర్ సిక్స్, పెన్షన్ పథకం, తల్లికి వందనం వంటి పథకాలు ప్రజలకు నేరుగా లాభం చేకూర్చుతున్నాయని వివరించారు. బండారు సత్యానందరావు నాయకత్వంలో కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధి గణనీయంగా జరిగిందని, 30 ఏళ్లుగా పట్టింపులేని సైఫాన్ పనులు ఆయన హయంలో పూర్తయ్యాయని తెలిపారు. అలాగే మురుగు వ్యర్థాల నిర్వహణ కోసం రూ.14 లక్షల గ్రాంట్ కూడా తీసుకొచ్చారని పేర్కొన్నారు. వాడపల్లి దేవస్థానంపై వచ్చిన విమర్శలను ఖండించిన నేతలు, "దేవాలయాలపై రాజకీయాలు చేయొద్దు. మా పాలనలో దేవాలయ అభివృద్ధికి సహకరించాం. వకుళ మాత అన్నదాన భవనాన్ని తిరిగి నిర్మిస్తాం" అన్నారు.

ఈ సమావేశంలో తోట వెంకట రమణ (రజిని), గూడేల నాగేంద్ర గౌడ్, నాగిరెడ్డి సత్యనారాయణ, దొడపనేని త్రినాథ్ రావు, వేత్స అనిల్, ముదునూరి పనేంద్ర వర్మ, కాళినేటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## డిప్లొమా విద్యార్థిని దేవికకు లాప్‌టాప్ బహుకరణ : మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్,జూలై 29:** డిప్లొమా విద్యార్థులకు టెక్నాలజీ ఆధారిత విద్యా సదుపాయాలు అందించడం తాము పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం ఆయన తన వ్యక్తిగత సిబ్బంది డ్రైవర్ అప్పలరాజు కుమార్తె దేవికకు లాప్‌టాప్‌ను బహుమతిగా అందజేశారు.దేవిక డిప్లొమాలో కంప్యూటర్ సైన్స్ చదువు కుంటుండగా, ఆమెకు లాప్‌టాప్ అవసరం ఉన్న విషయం తెలుసుకున్న మంత్రి స్వయంగా స్పందించి సాంకేతిక సహాయంగా లాప్‌టాప్ అందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "టెక్నాలజీ ద్వారా మేధాశక్తిని అభివృద్ధి చేసుకోవడంతో పాటు, విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడంలో మరింత వేగంగా ముందుకు సాగగలరు," అని చెప్పారు.విద్యారంగానికి అవసరమైన అన్ని వనరులను అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం గారు ఈ సందర్భంగా దేవికకు ఆశీస్సులు తెలియజేశారు.ఈ విద్యార్థిని దేవిక కుటుంబసభ్యులు, స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.మానవతా దృక్పథంతో నిత్యం ప్రజలలో ఉండే మంత్రి సుభాష్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని నాయకులు అభిప్రాయపడ్డారు.

## పేకాట రాయుళ్ళ గుట్టు రట్టు

### ఎస్సై లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో దాడులు, నగదు స్వాధీనం



**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 29:** గ్రామీణ ప్రజల్లో వ్యసనాల వల్ల పడుతున్న నష్టాన్ని అరికట్టేందుకు ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం చర్యలు చేపట్టారు. మండలం లోని ఓమ్మంగి శివారులో రహస్యంగా పేకాట ఆడుతు న్న గుంపుపై మెరుపు దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 10,760 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు పోలీసులకు ముందుగా వచ్చిన నమ్మదగిన సమాచారం ఆధారంగా చేపట్టినవిగా పోలీసులు తెలిపారు. ఎస్ఐ లక్ష్మీకాంతం తన సిబ్బందితో సమన్వయంగా చురుకైన చర్యలు తీసుకొని పేకాట స్థావరాన్ని విడిచిపెట్టే అవకాశం లేకుండా దాడి చేశారు. కొందరు పారిపోగా, ముగ్గురిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మీకాంతం మాట్లాడుతూ "పేకాట, గుండాట, కోడిపం దాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నాయని, పోలీస్ శాఖ వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవ లి కాలంలో పేకాట, గాంజా వ్యసనం, కోడిపందాలు వంటి వ్యవస్థాపిత అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, లక్ష్మీకాంతం చర్య ప్రజల్లో భద్రతాభావాన్ని కలిగిస్తోంది. ప్రజల్లో చైతన్యం పెంచుతూ, యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచేలా పోలీసులు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్న దృష్ట్యా, స్థానికులు ఎస్ఐ లక్ష్మీకాంతం సేవలను అభినందిస్తున్నారు.

## పేకేరు, బాలాంత్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**కె గంగవరం పెన్ పవర్ జులై 29:** కే గంగవరం మండలం పేకేరు మరియు బాలాంత్రం గ్రామాల్లో మంగళవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఏ. సద్గురుమూర్తి నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు బి. నాగకుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని, తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహారం మరియు జీవన విధానాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఖరీఫ్ - 2025 పంట నమోదు ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి రైతు తమకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులు తమ వరి పంటను కేవలం రూ.76 నామమాత్రపు ప్రీమియంతో మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. ఈ బీమా పథకం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ లభిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పేకేరు కూటమి నాయకులు చల్లగాల్ల నాగేశ్వరరావు, బాలాంతరం గ్రామ నేతలు మల్లిపూడి బుజ్జి, కోలేటి కృష్ణమూర్తి, సర్పంచ్ చాగంటి సాంబశివరావు, గ్రామ వి.ఏ.లు సత్యనారాయణ, సాయి శ్రీలు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీల నిలువు దోపిడీ ఆపాలి

## ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

### ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్స్ ముందు దర్నాలను జయప్రదం చేయండి



**అమలాపురం పెన్ పవర్ జూలై29:** బలవంతంగా బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురం ప్రజావేదిక ఆధ్వర్యంలో నేడు అమలాపురం సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ ఏఐటియుసి నాయకులు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ . ఏఐటీయూసీ వ్యవసాయ కార్మిక సంఘం కౌలు రైతు సంఘం తదితర ప్రజాసంఘాల ముఖ్య నాయకులు హాజరవడం జరిగింది.ఈసందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటియుసి బాధ్యులు కే సత్తిబాబు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ

గత వైసిపి ప్రభుత్వం 9 సార్లు కరెంటు చార్జీలు పెంచి, రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం వేసిందని,ఇక బాదుడు ఉండదని చెప్పి టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగల కొట్టండని లోకేష్ కూటమి నేతలు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం మాట తప్పింది. నమ్మకద్రోహం చేసింది. సంవత్సర కాలంలో కరెంట్ బిల్లులు పెరిగిపోయి జనం గగ్గోలు పెడుతున్నా, చార్జీలు పెంచలేదంటూ మోసగిస్తున్నారు. ఏ వస్తువుకీ, సర్వీసుకి లేని విధంగా వాడుకున్న ఐదేళ్ళ తరువాత కూడా లోటు వచ్చిందనే పేరుతో ట్రూఅప్ సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్పిపిసిఎ) జనం నుండి వసూలు చేసే విధానాన్ని సంస్కరణలలో భాగంగా టిడిపి ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టింది. అక్రమ ఒప్పందాలు, అవినీతి చర్యలతో ఖర్చులు పెంచి ప్రజల నుండి ఈ సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయం.2022-23,2023-24 సంవత్సరాల్లో వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా, మళ్లీ అదనంగా రూ.15,485 కోట్లు సర్దుబాటు చార్జీల భారం కూటమి సర్కార్ మోపింది వాపోయారు. 2014 నుండి 2019 వరకు వాడుకున్న కరెంటుకు మళ్ళీ అదనంగా రూ.3 వేలకోట్లు ట్రూఅప్ ఛార్జీలు గత 36 నెలల నుండి వసూళ్లు చేస్తున్నారు. ప్రతినెల అదనంగా 40 పైసల ఇంధన సర్దుబాటు చార్జీల బాదుడు సాగుతూనే ఉంది.ఈ ఒక్క సంవత్సరంలోనే రూ.2,787 కోట్లు అదనపు భారం వేశారు. ఒకవైపున మిగులు ఉందని చెబుతూనే అదనపు సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అని అన్నారు. వ్యాపారులు, చిన్న పరిశ్రమలపై విద్యుత్ సుంకం యూనిట్ 6 పైసల నుండి 100 పైసలకు వైసిపి ప్రభుత్వం పెంచింది. కూటమి ప్రభుత్వం దానిని తగ్గించకపోగా, చట్ట సవరణ చేసి భారం కొనసాగిస్తున్నది.అదనపు లోడ్ పేరుతో డెవలప్మెంట్ చార్జీలు, వినియోగదారుల డిపాజిట్ల సాకుతో వేల రూపాయలు దొడ్డిదారిన వసూలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఈ భారాలు అన్నింటిని కప్పిపుచ్చి రూ.450 కోట్లు చార్జీలు ట్రూ డౌన్ ద్వారా తగ్గిస్తున్నట్లు నమ్మబలుకుతున్నారు. ఆదాయాలు పెరగక, కరెంటు బిల్లులు కట్టలేక జనం అవస్థలు పడుతున్నారు. చిన్నా, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలు దెబ్బతింటున్నాయి.కొన్ని మూతపడుతు న్నాయి. ఉపాధి కోల్పోతున్నారు.అభివృద్ధి కుంటుబడుతున్నది. ఈ సర్దుబాటు చార్జీల భారం మీది అంటే మీదని టిడిపి, వైసిపి ఒకరి మీద మరొకరు నెపం నెట్టుకుంటున్నారు. ఈ పాపంలో బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన అందరి వాటా ఉన్నది. అందరూ దోషులే అని వారు ఆరోపించారు.

### అదాని స్మార్ట్ మీటర్ల బాగోతం

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకోవటానికి ప్రభుత్వాలు పూనుకుంటున్నాయి. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి, కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నది. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదు, విధానం మార్పు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణకు కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న కుట్రలో ఇది ఒక అడుగు. సెల్ ఫోన్ తరహాలో ఇక ముందుగానే డబ్బు చెల్లించి కరెంటు కూడా రీఛార్జ్ చేయించుకోవాలి.ఈ పద్ధతి వలన బడా కంపెనీలు దేశంలో రూ.23 లక్షల కోట్లు అడ్వాన్స్ రూపంలో జనం నుండి గుంజుతారు. ఈ మీటర్ ఖర్చు సింగిల్ ఫేస్కు రూ.9వేలు, త్రీఫేస్కి రూ.17 వేలు. 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో జనం నుండే వసూలు చేస్తారని వాపోయారు. తరువాత మళ్లీ మీటర్ మార్చుకోవాల్సిందే. మళ్లీ డబ్బు కట్టాల్సిందే,ఇక గంట గంటకి రీడింగ్ తీస్తారు. పగలు కంటే రాత్రి వాడే కరెంటుకు అధిక బిల్లులు వేస్తారు. వేసవికాలంలో ఎక్కువ రేట్లు వసూలు చేస్తారని,వైర్లెస్ టెక్నాలజీ ద్వారా ఆదానీ కార్యాలయంలో ఉండి మన మీటర్ను ఆపరేట్ చేస్తారు. ఇంటికి వచ్చి రీడింగ్ చూడరు, బిల్లు పంపుతారని వాపోయారు.ఆ బిల్లులో తప్పులకు సమాధానం చెప్పే నాధుడు ఉండడు, ఈ మీటర్లతో ప్రజల వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం ఏర్పడుతుందనే అనుమానాలు ఉన్నాయని,%ి% కాబట్టి ప్రజలందరూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొనాలని, ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు జరిగే ధర్నాల్లో ప్రజలందరు పాల్గొనాలని, అమలాపురం రాజోలు, కొత్తపేట రామచంద్రపురం మండపేట ముమ్మిడివరం సబ్ స్టేషన్ ముందు ఆగస్టు 5 తేదీ జరిగే ధర్నాలలో భారీ జన సమీకరణతో చేయాలని, ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈరోజు విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ప్రజలు కొన్ని చోట్ల వ్యతిరేకిస్తున్నారని బలవంతంగా ఏ ఇంటికి స్మార్ట్ మీటర్ ను బిగించేది లేదని ఇండస్ట్రియల్ ప్రాంతాలకు మాత్రమే తక్షణం స్మార్ట్ మీటర్ ను బిగిస్తున్నామని ప్రజలు వ్యతిరేకిస్తే బిగించబోమని ప్రకటన చేయడం జరిగిందని ప్రజలు వినియోగద్దారులు ఈ స్మార్ట్ మీటర్లని ని మరింత వ్యతిరేకిస్తే ప్రభుత్వం వెనక్కి తగ్గుతుందని,ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు,ఏ ఐటియు సి ..వ్యవసాయ కార్మిక సంఘం కౌలురైతు సంఘం తదితర ప్రజాసంఘాల నాయకులు పీతల రామచంద్రరావు, నిమ్మకాయల శ్రీనివాసరావు, కె.భాస్కరరావు, జి రమణ, ఊటాల వెంకటేశ్, పి మురళీకృష్ణ, జి సత్యం, కే. వెంకట సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా సర్పంచ్ లావణ్య పుట్టినరోజు వేడుకలు

### భవిత దివ్యాంగ విద్యార్థులకు భోజనం ఏర్పాట్లు..

**ఆలమూరు, పెన్ పవర్,జూలై 29:**మండల కేంద్రమైన ఆలమూరు గ్రామ సర్పంచ్ ఎన్ లావణ్య కుమార్ రాజా పుట్టినరోజు వేడుకలు సోమవారం భవిత దివ్యాంగుల పాఠశాల నందు, గ్రామ పంచాయతీ వద్ద ఘనంగా నిర్వహించారు.ముందుగా గ్రామపంచాయ తీ లోను, భవిత కేంద్రం నందు ఆమె కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేయగా సిబ్బంది, విద్యార్థులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం దివ్యాంగ విద్యార్థుల కు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్య కిరణ్, విజయలక్ష్మి, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయానికి విరాళం



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 29:** చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం కలవచర్లకు చెందిన వడ్డీ మణి బాబు రూ.5116 లు మంగళవారం విరాళంగా అందజేశారు. అమ్మవారి ఆలయంలో జరుగుతున్న గోపురాల నిర్మాణంలో ఈ మొత్తాన్ని వినియోగించమని ఆయన కోరారు.

## మాదక ద్రవ్యాలకు బానిసలు కాకండి.. ట్రైనింగ్ ఎస్సై బి.సురేష్



**సీతానగరం, పెన్ పవర్, జూలై 29:** యువత మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలు పాడు చేసుకోరాదని ట్రైనింగ్ ఎస్సై బి. సురేష్ తెలిపారు, సీతానగరం మండలంలోని మంగళవారం నాడు ఆర్కే టెక్నో స్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గానికి దూరంగా ఉండి మంచి మార్గంలో పయనించాలని యువత ఎన్నో అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ సభ్యులకు అండగా ఉంటూ జీవితంలో మంచి స్థానాన్ని సంపాదించాలన్నారు. ప్రభుత్వం యువతను మంచి మార్గంలో తీసుకొచ్చేందుకు యువత కోసం ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు, యువత మేల్కొలిపేందుకు మంచి మార్గంలో నడిచేందుకే ప్రతి మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో చేపడుతున్నారు. ప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్ బానిసరి వారి నిండు నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకుంటూ కుటుంబ సభ్యులకు పెనుభారంగా మిగులుతూ కుటుంబ సభ్యులకు బాధ మిగులుస్తుందన్నారు, ప్రభుత్వం అనేక విధాలుగా విద్యకు తోడ్పాటు అందిస్తూ పై చదువుల కోసం అనేక వసతులను ఏర్పాటు చేసిందని వాటన్నిటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్గంలో నడవాలన్నారు. సైబర్ నేరాలు పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని, తెలిపారు, ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బందిఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాగంపేటలో సీలింగ్ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలి: వీరాంజనేయులు




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** జగ్గంపేట శివారు జెడ్.రాగంపేట గ్రామంలో సర్వే నెంబర్ 204లో ఉన్న ఎనిమిది ఎకరాలు సీలింగ్ భూమిని జడ్.రాగంపేట, నీలాద్రిరావుపేటకు చెందిన దళిత, ఇతర పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నీలాద్రిరావుపేటలో ఇళ్ల స్థలాల సమస్యపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిడిఎస్ యు (వి) రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీ ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్ టు యు ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు, అధ్యక్షులు మడికి సత్యం, ప్రగతిశీల మహిళా సంఘం ( స్త్రీ విముక్తి) నాయకులు రెడ్డి దుర్గాదేవి, ఏపీ ఆర్ సి ఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, ఎల్లే సత్తిబాబు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 78 ఏళ్ళ స్వతంత్ర భారతంలో నేటికీ ఉండడానికి ఇల్లు లేక అనేకమంది ఇబ్బంది పడుతున్నారని, ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకవర్గ పార్టీలు ప్రజల ఇళ్ల స్థలాల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేదని విమర్శించారు. గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో నేటికీ అనేకమంది ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలోనూ, చెరువు గట్ల మీద, రోడ్డు వారన గుడిసెలలో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా గండేపల్లి మండలం జడ్.రాగంపేట గ్రామంలో 204 సర్వే నెంబర్‌లో సుమారు 8 ఎకరాల సీలింగ్ భూమి నిరుపయోగంగా ఉందని, ఆ భూమిని జడ్. రాగంపేట, నీలాద్రిరావుపేట గ్రామాలకి చెందిన దళిత, ఇతర పేదలకు మూడేసి సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ నాయకులు జాను, శభాష్టియన్, నాగమణి ,ఇళ్ల స్థలాలు పోరాట కమిటీ నాయకులు దూళ్ళ ఆశీర్వాదం , నందా లక్ష్మి, ఏ .వీరగనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా అభిప్రాయంతోనే రహదారి అభివృద్ధి
### -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 29:** మండలంలోని ఇసుకపూడి గ్రామంలో సుమారు రూ. 1.25 కోట్ల వ్యయంతో నూతన రోడ్ల నిర్మాణ పనులకొరకు పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ మంగళవారం ఇసుకపూడి గ్రామాన్ని సందర్శించా రు. గ్రామంలో రోడ్ల అవసరాన్ని వివరించడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే గ్రామానికి చేరుకుని, ప్రజల అభిప్రాయాల ప్రకారమే రోడ్డు నిర్మాణం జరుగుతుందని హామీ ఇచ్చారు. త్వరలో పనులు ప్రారంభమవు తాయని తెలియజే శారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో మాట్లాడి, వారితోపాటు భోజనం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, త్రాగునీటి సమస్యను ఎమ్మెల్యే వివరించగా, విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట మండలంలో
## బాబు షూరిటీ మోసం - గ్యారంటీ
### అతిథిగా అంబేద్కర్ కోనసీమ వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



**కొత్తపేట, పెన్ పవర్, జూలై29:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "బాబు షూరిటీ మోసం–గ్యారంటీ" ప్రచార కార్యక్రమం మంగళవారం కొత్తపేట నియోజకవర్గం– కొత్తపేట మండలంలో ఘనంగా నిర్వహించబడింది. ఈకార్యక్రమానికి మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. అలాగే, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు సిరిపురపు శ్రీనివాసరావు, అముడా మాజీ చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, చిర్ల అభిమాని శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ముఖ్య అతిథి చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు పాలనను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ప్రజల పక్షాన పనిచేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈవిషయంలో నిరంతరం పోరాటం చేస్తోందని, ప్రతి ఒక్క కార్యకర్త ఈ సందేశాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముద్రగడ ఆరోగ్యంగా ఉండాలని శివాలయంలో గిరిజన మహిళలు పూజలు



**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 29 :** ప్రత్తిపాడు మండలం వెంటకనగరం పంచాయతీ శివారు గ్రామం తోటపల్లిలో ప్రసిద్ధి గాంచిన దార మల్లికార్జున స్వామి శివాలయంలో మాజీ మంత్రి వైసీపీ పిఏసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలిని తోటపల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళలు, వైసీపీ నాయ కులు, అభిమానులు మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి దొరబా బు, వెంకటనగరం మాజీ సర్పంచ్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కోరాపు గంగరాజు, యెనుమల దొరబాబు, సింహాద్రి కుమార్, కోరాపు చక్రం, తెడ్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలి
### జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గంగవరం,పెన్ పవర్,జూలై 29:** రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ హెచ్చరించా రు.ఆధార్ సంఖ్యను బ్యాంకు ఖాతాలతో సక్రమంగా అనుసంధానం చేసి అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ అందించాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి 22 మండలాల తాహశీల్దారులతో సర్వేయర్లు, డిప్యూటీ తాహశీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అర్జీదా రులను కార్యాలయాలకు తిప్పకూడదన్నారు.కలెక్టర్ సంతకం కావాలని పంపిస్తున్నారని అన్నారు. కలెక్టర్ సంతకాలకు పంపించకూడదన్నారు. మ్యుటేషన్ ప్రక్రియ సక్రమంగా చేయకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు.ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే తొలగింపు చర్యలు చేపట్టాల న్నారు. భూ వివాదాలను తాహశీల్దారులు, ఎంపిడిఓలు,సబ్ ఇన్సెపెక్టర్లు సంయుక్తంగా పరిష్కారం చూపించాలని అన్నారు.జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎం. జె.అభిషేక్ గౌడ మ్యుటేషన్లకు మాట్లాడుతూ భూముల రీసర్వే,13 నోటిఫికేషన్ జారీ, రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం,జిఓ నెం 23 ప్రకారం హౌస్ సైట్ల పరిశీలనపై సమీక్షించారు.భూములు రీ సర్వే పకడ్బందీగా చేయించ వలసిన బాధ్యత తాహశీల్దారులపైనే ఉందన్నారు.రీ సర్వే చేయడానికి 13 నోటిఫికేషన్ జారీ చేసి,ఫారం 3,4 పత్రాలను జారీ చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు.అదే విధంగా పి జి ఆర్ ఎస్ స్వీకరించిన ఫిర్యాదులను త్వరత్వరగా పరిష్కారం చూపించాలని చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్సులో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్,డిఆర్ఓ కె.పద్మావతి,వర్చువల్గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, 22 మండలాల తాహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

## వివిధ అంశాలపై సమీక్ష : జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 29:** మంగళవారం బొమ్మూరు కలెక్టరేట్ వీడియో దృశ్య మాధ్యమ సమావేశ మందిరంలో అన్నదాత సుఖీభవ, తదితర అంశాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణం, కమాండ్ ఏరియా అభివృద్ధి, పి4 సర్వే, సంక్షేమ వసతి గృహాలు, తదితర అంశాల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనర్హులైన రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు తిరస్కరణ కారణాలు వివరించి, సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ నంబర్ 0883-2944455 అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల వివరాలు ఆధార్ లింకింగ్ కీలకం అన్నారు. లబ్ధిదారుల ఖాతాల ఆధార్ లింకేజీ లేని కారణంగా డీబీటి జమ కాకపోతున్నందున, అన్ని ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ పురోగతిపై ప్రగతి సాధించలేని మండలాల్లో ఎంపీడీవోలు, గృహ నిర్మాణ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల నుంచి అడ్వాన్స్డ్ నిధులను తిరిగి తీసుకునేలా చర్యలు సూచించారు. పి4 బంగారు కుటుంబాలపై దృష్టి పెట్టాలని, సర్వే వేగవంతం చేయాలన్నారు. మార్గదర్శులు కేవలం ఆర్థికంగా కాకుండా బంగారు కుటుంబాలకు గుర్తించిన కుటుంబాల స్థితి గతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో మార్పు తీసుకు రావాలన్నారు. ఆయా కుటుంబాల మెరుగైన స్థితి కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు..కాడా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కమాండ్ ఏరియా పనులపై కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష నిర్వహించారు. కాలువల పూడికతీత పనుల పురోగతిపై క్షేత్రస్థాయి నివేదిక కోరారు. వర్షాకాలంలో ముంపు నివారణకు వీటిపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. సంక్షేమ వసతి గృహాల పరిశుభ్రత గురించి ప్రతి శనివారం వసతి గృహాలను ఎంపీడీవోలు, తహసిల్దార్లు సందర్శించాలన్నారు. దోమల నివారణ చర్యలు, మెష్‌లు ఏర్పాటు వంటి వాటికి మండల ప్రజా పరిషత్, పంచాయతీ నిధుల నుంచి ఖర్చు చేయాలన్నారు. ఎస్ఓపీ ప్రకారం రీ సర్వే జరగాలని, అన్ని భూ యజమానులకు సమాచారం వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంపై స్పష్టత అవసరం అని అన్నారు. సిసిఆర్సి కార్డుదారులైన కౌలురైతులకు బ్యాంకుల ద్వారా రుణాల ప్రాప్తిని నిర్ధారించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డిఆర్ఓ టి.సీతారామమూర్తి, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్ రెడ్డి, సిపిఓ ఎల్.అప్పలకొండ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ.వీ.గిరి, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, డ్వామా పిడి ఎమ్.నాగమల్లేశ్వరరావు, బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఇతర జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



## సామాజిక వనాల పెంపకం ఉద్యమంలా సాగాలి

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 29:** సామాజి క వనాల పెంపకం ఒక ఉద్యమంలో సాగాలని ప్రకృతి పర్యా వరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఏలేశ్వరం నర్సీపట్నం రోడ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని డాక్టర్ విజయబాబు మంగళవారం ప్రారంభించారు. స్థానిక బాలాజీ చౌక్ సెంటర్ నుండి కరెంట్ ఆఫీస్ వరకు నర్సీపట్నం రోడ్డుకు ఇరువైపులా 40 మొక్కలను నాటారు. అలాగే నంది వీధిలో ఇటీవల రిటైర్డ్ ఎమ్మార్వో కరోతు సత్యనారాయణ వీధిలో పచ్చదనానికి మొక్కలను నాటి వాటి పెంపకాన్ని పర్యవేక్షించారు. మొక్కలు నాటే కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎం సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఏలేశ్వరం బనానా ల్యాండ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, ఏపీ ట్రాన్స్కో రిటైర్డ్ ఉద్యోగి దువ్వా సూరిబాబు లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని సమతుల్యం చేయడానికి, భావితరాలకు ఆరోగ్యకర వాతావరణం సృష్టించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోళ్ళ నాగేశ్వరరావు, కోశాధికారి కోట శ్రీనివాస చక్రవర్తి, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు, సీనియర్ విలేకరి వేల్పుల సూరిబాబు, పర్యావరణ పరిరక్షణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కొనసీమ తిరుమలలో వైభవంగా స్వామి వారికి విశిష్ట పూజలు
### అష్టోత్రం నిత్య కళ్యాణంలో అత్యధిక సంఖ్యలో భక్తులు

**అమలాపురం,పెన్ పవర్ జూలై 29:** కొనసీమ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం స్వామి వారికి విశిష్ట పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో పూజలను ప్రారంభించి, భక్తిసాంప్రదాయ పద్ధతిలో స్వామివారికి ప్రత్యేక సేవలు అందించారు. శ్రీవారి వసంత మండపంలో ఏడవారాల పాటు నిష్టతో కొనసాగిన నోము (దీక్ష)ను పూర్తిచేసుకున్న భక్తులు స్వామివారికి అష్టోత్తర శతనామార్చన సేవను నిర్వహించారు. అనంతరం పుష్పాంజలి, నైవేద్యం, హారతులు అర్పించారు. ఆలయ ప్రాంగణం వేద ఘోషలు, మంగళవాయిద్యాలతో మారోగిపోయింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుంటూ, కుటుంబ సమేతంగా హారతులు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.స్థానిక ప్రముఖులు, ఆధ్యాత్మికతకు, సాంప్రదాయాలకు మారుపేరైన కొనసీమ తిరుమల ఆలయంలో ఇటువంటి విశిష్ట సేవలు భక్తుల్ని మరింతగా ఆకట్టుకుంటున్నాయి.



## హరిహర వీరమల్లు
## చిత్ర విజయోత్సవ సంబరాలు




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ నటించిన హిస్టారికల్ మూవీ హరిహర వీరమల్లు ఇటీవల విడుదలై భారీ విజయం సాధించింది. జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం జగ్గంపేట నాగేశ్వర థియేటర్ లో సంబరాలు జరిగాయి. ముందుగా తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జనసైనికులు సినిమా చూసి అనంతరం కేక్ ను కట్ చేసి స్వీట్స్ పంచుతూ తమ నాయకుడు పవన్ కళ్యాణ్ సినిమా భారీ విజయం చేకూరడం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ హరిహర వీరమల్లు సినిమా ఘన విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని, చరిత్ర గురించి చెప్పడం సందేశాత్మక సినిమాలు తీయడం కేవలం పవన్ కళ్యాణ్ కు మాత్రమే సాధ్యమని, రికార్డు స్థాయిలో ఈ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తుందని, వైసిపి నాయకులు దిగజారిపోయి సినిమాని డిజాస్టర్ అని అపోహాలు సృష్టించినా ప్రజలు సినిమాని ఆదరించి ఘన విజయం అందించారని ఇది వైసీపీ నాయకులకి చంపదెబ్బ లాంటిదని అన్నారు. ఇంతటి ఘన విజయం సాధించడానికి కృషి చేసిన తెలుగు రాష్ట్ర ప్రేక్షకులకు ప్రజలందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారీగా జనసైనికులు, కార్యకర్తలు, వీరామహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

## తెలుగు యువత అధ్యక్షులుగా ముత్యాల బాబీ



**అల్లవరం, పెన్ పవర్, జూలై 29:** మండలం తెలుగు దేశం పార్టీ తెలుగు యువత అధ్యక్షులు గా నిమితులైన ముత్యాల బాబి ని బోడసకుర్రు వారి స్వగృహం నందు అల్లవరం మండలం సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపాలకృష్ణ గోపి శాలువాతో సత్కరించి అభినందించినారు.ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు పోలిశెట్టి బాబులు, రొక్కాల నాగేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, పిల్లా ప్రసాద్, యళ్ళ బిందాస్, జల్లి స్వామి తదితరులు అభినందలు తెలియజేసినారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశాలకు జూలై 31 వరకు అవకాశం: ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శ్రీనివాస్

**కాజులూరు, పెన్ పవర్,జూలై 29:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024%-%25 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం జూలై 31వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థి యాళ్ళ వెంకట దుర్గ సత్యేశ్వర్ కాకినాడ జిల్లాలో బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించడమేకాక, వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమరావతిలో ఫ్రీ సీటు పొందినట్లు తెలిపారు. అలాగే కట్టా శిరీష బీఫార్మసీ గ్రూపులో 440కు 435 మార్కులు సాధించినట్లు వివరించారు.కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్కీమ్, ఉచిత పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్, తల్లికి వందనం వంటి ప్రభుత్వ పథకాల అమలుతో అడ్మిషన్లు 85 నుంచి 118కు పెరిగాయి అని ప్రిన్సిపాల్ వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన భవిష్యత్తు కోసం కళాశాల సేవలను వినియోగించుకోవాలన్నారు.

## ప్రకృతి రక్షణ ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం




**గంగవరం, పెన్ పవర్, జూలై 30:** ప్రకృతిలోని వృక్షాలను, సహ జ వనరులను రక్షించుకోవడం ద్వారా మానవజాతి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమం వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలం లోని మోహనాపురంలో ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భం గా వైద్యనిపుణులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చెట్లను విపరీతంగా నరికి వేస్తున్నారని ,ఎండాకాలంలో అడవులకు అగ్గిపెట్టి కాల్చి వేస్తున్నారని అని దీనివల్ల సమాజానికి పనికొచ్చే ఎన్నో రకాల వృక్ష సంపద అంతరించిపోతుందన్నారు. అటవీ ప్రాంతం లోనూ వాగులు వద్ద, ఖాళీ ప్రదేశాల్లో చెట్లను విపరీతం గా పెంచాలని దీనివల్ల ప్రాణవాయువు దొరికి ప్రాణుల యొక్క ఆరోగ్యం మెరుగుపడుతుం దన్నారు. ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడు కాటంరెడ్డి మాట్లాడుతూ అడ్డతీగలలో 50 మంది విద్యార్థులతో వసతిగృహం నిర్వహిస్తున్నామని ప్రతి నెల మోహనాపురం, అడ్డతీగల తదితర ప్రాంతాల్లో మెగా వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. ప్రజల కోరికపై ఏ గ్రామంలోనైనా వైద్య శిబిరం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ వి వి సత్యనారాయణ డిప్యూటీ వార్డెన్ వీరపు దొర ఉపాధ్యాయుడు సోమయ్య ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ప్రతినిధులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 29:** స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జగ్గంపేట జనసేన ఇంచార్జ్ మరియు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతు గత ఎన్నికల అన్నంతరం ఈ డొక్కా సీతమ్మ క్యాంటీన్ ప్రారంభించి ప్రతి మంగళవారం నిర్విరామంగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, మరిసే రామకృష్ణ, పాట్టంశెట్టి రమేష్, గంధం శ్రీను, కనకరాజు, అరినే రాజేష్, పాలెం బాబీ, చల్లా రాజ్యలక్ష్మి, గండికోట శ్రీను, శ్రీమన్నారాయణ, కాయల మణికంఠ, ముత్యాల వెంకట రాజు, డ్రిల్ మాస్టారు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తప్పు చేసినవారిని వదిలేది లేదు

## రాజవొమ్మంగి కొత్త సీఐ గౌరీశంకర్ హెచ్చరిక



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 29:** రాజవొమ్మంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీఐ గౌరీశంకర్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు, స్థానిక పరిస్థితులపై నాకు పూర్తి అవగాహన ఉంది. చట్టానికి వ్యతిరేకంగా జరిగే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించను. ఒక్కసారి చెబితే చేస్తాను. తప్పు చేసినవారిని వదిలే ప్రసక్తే లేదు. నిర్దోషులకు అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాను. తప్పుడు కేసులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. న్యాయాన్ని దుర్వినియోగం చేయాలనుకునేవారిని ఉపేక్షించేది లేదు. ఒక దోషికి శిక్ష పడకపోయినా పర్వాలేదు... కానీ ఓ నిర్దోషికి శిక్ష పడకూడదనే ధోరణితో ముందుకు సాగుతాను" అని స్పష్టంగా తెలిపారు. ఇప్పటివరకు రాజవొమ్మంగిలో సీఐగా విధులు నిర్వహించిన సన్యాసినాయుడు బదిలీపై రంపచోడవరం వెళ్లారు. ప్రజల పక్షాన నిఖార్సైన వైఖరితో సేవలందించిన ఆయనపై ప్రజల్లో మంచి అభిమానం ఏర్పడింది. ఆయన బదిలీపై స్థానికులు కొంతమంది విచారం వ్యక్తం చేసినప్పటికీ, ఉద్యోగ బదిలీలు సహజమని అర్థం చేసుకుంటున్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన గౌరీశంకర్‌పై ప్రజల్లో విశ్వాసం నెలకొంది. శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన ధీర్మత, న్యాయపరమైన స్పష్టత ప్రజల్లో ఆశాభావాన్ని కలిగిస్తోంది.

# బివిఆర్ కళా కేంద్రాన్ని కాపాడుకుంటాం

## అఖిలపక్ష సమావేశంలో వక్తలు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 29:** బివిఆర్ కళా కేంద్రాన్ని కాపాడుకుంటామని అఖిలపక్ష నాయకులు అన్నారు. బి.వి.ఆర్ కళా కేంద్రం పరిరక్షణకై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు మాట్లాడుతూ 65 ఏళ్ల చరిత్ర గల ఆఫీసర్స్ క్లబ్ కు ఆనాటి జిల్లా కలెక్టర్ స్థలం మంజూరు చేశారని చెప్పారు. అప్పటినుంచి సంఘ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బి.వి.ఆర్ కళా కేంద్రం సరిహద్దులో ఉన్న కోర్టు పార్కింగ్ నిమిత్తం, కళా కేంద్రం వెనుక ఉన్న సబ్ జైలు అర ఎకరం స్థలాన్ని పరిశీలించమని ఆర్డిఓ కి కమిషనర్ కి, సభ్యులుగా ఉండి పరిశీలించమని కలెక్టర్ ఆదేశిం డం జరిగిందన్నారు. సంస్థని తీసుకోమని ఎక్కడ చెప్పలేదన్నారు. బి వి ఆర్ కళా కేంద్రం 19 సంవత్సరాలుగా పన్ను ఒకేసారి చెల్లిం చడం జరిగిందన్నారు. ఇలాంటి ఆరు దశాబ్దాలుగా ఉన్న కళా కేంద్రాన్ని ఖాళీ చేయించాలంటే పత్యమ్నాయం చూపించా లన్నా రు. కాంగ్రెస్ పార్టీ పశ్చిమగోదావరి జిల్లా ఇంచార్జ్ మార్నీడి బాబ్జి మాట్లాడుతూ కళాకారుల బాసటగా నిలిచిన బివిఆర్ కళాకేంద్రం ను పరిరక్షించాలని కమిషనర్ ను హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు చింతకాయల బాబు రావు మాట్లాడుతూ ఈ సంస్థలో కొన్ని వేల కళా ప్రదర్శనలు నిర్వహించి మంచి మన్ననలు పొందిన బివిఆర్ కళా కేంద్రాన్ని నిర్వీర్యం చేయడం తగదన్నారు. సిపిఐ నాయకులు మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణం లో గాంధీ మండపం, లైబ్రరీ లైబ్రరీ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారని వాటిని ఖాళీ చేయించాలని పలువురుకు ఉపయోగపడే కళా కేంద్రాన్ని ఖాళీ చేయించడం సరైంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బివి ఆర్ కళా కేంద్రం కార్యదర్శి ఎన్ వి రమణారావు, త్యాగరాయ గాన సభ బాపయ్య శర్మ, అన్నమయ్య పద సుధ దాసరి కాశీ విశ్వనాథం, ఆత్మ బంధువుల సేవా సంఘం కార్యదర్శి కిరణ్,ఘంటసాల గానసభ ఖాసీమ్, సాయి చిరు,బ్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ ఎస్ ప్రసాద్, రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, మసా బాబు రావు, ప్రముఖ హారికదా కళాకారిణి శారద, రంగస్థల నటి నాగమణి,మురళి కృష్ణ, పైలు శ్రీనివాసరావు, శరత్ ఆర్కెస్ట్రా శరత్,మేఘమాల కామేష్, బాలు కళా మిత్ర మండలి కార్యదర్శి శేషా రెడ్డి, పావని, మేనా నానాజీ, బుర్రకథా, హరికదా కళా కారులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సేవలు అందించాలి

## ఎమ్మెల్యే వేగుళ్ల






**మండపేట. పెన్ పవర్.జూలై 29:**సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన మండపేట మండలం, జెడ్ మేడపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ళ పాల్గొన్నారు. అధ్యక్షుడిగా సలాది బాలసుబ్రమణ్యం, సభ్యులుగా సంగిశెట్టి అమ్మన్న, బోయిడి వెంకటరమణలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ కూటమి నాయకులు, రైతులతో కలసి నూతన కమిటి సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, జడ్ మేడపాడు సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, సొసైటీ కార్యదర్శి రామకృష్ణ, మండపేట మండల టీడీపీ మాజీ అధ్యక్షులు యరగతపు బాబ్జి, గోణం పుల్లయ్య, సత్తి సత్యనారాయణ, పల్లా వీరబాబు, తులా విష్ణు, చింతా దొరబాబు, కుంచె ప్రసాద్, తానంకి చంద్రశేఖర్, అడబాల బుల్లబ్బు, కంకటాల మురళీకృష్ణ, పంతంగి బోసు, పంతంగి ఉమామహేశ్వరరావు, వర్రే వీరబాబు, యరగతపు గణేష్, యాదగని గోవిందు, మండా లక్ష్మీ వీరభద్రరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపాలెం-కుయ్యేరు రోడ్, పునర్నిర్మాణానికి వినతిపత్రాలు

## అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి






**కాజులూరు, పెన్ పవర్ జూలై 29:**గొల్లపాలెం నుంచి కుయ్యేరు వరకు రోడ్ నిర్మాణం చేపట్టాలని, మెయిన్ రోడ్‌లో పాడైన వంతెనలను పునర్నిర్మించా లని అఖిలపక్షం నేతలు మండల తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఇన్చార్జి ఎంపీడీవో అనుపమకు మంగళవారం వినతిపత్రాలు సమర్పించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా రోడ్లు శిథిలమై ప్రయాణికులు, ఆటోలు, టూవీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని, చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. రహదారుల పునర్నిర్మాణంతో పాటు గ్రామాలను కలిపే రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాధవరపు నానాజీ, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వళ్లు రాజబాబు, పైడికొండల వీరభద్రరావు, ఎర్రంశెట్టి కొండ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం




## రైతులకు ఎరువుల వినియోగంపై అవగాహన

**కాజులూరు, పెన్ పవర్,జూలై 29:** కాజులూరు మండలంలోని గొల్లపాలెం గ్రామ రైతు భరోసా కేంద్రంలో "పొలం పిలుస్తుంది" కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఎరువులు, పెస్టిసైడ్లు (మందులు) వాడే సరైన మోతాదులపై పూర్తి అవగాహన కల్పించారు. వానాకాలం సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, కందులు, ఎరువులు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణులు పంటల స్థితిగతులు, ఖరీఫ్ పంటలకు అనుసరించ వలసిన సాగు విధానాలను రైతులకు వివరించారు.వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే దిగుబడులు పెరుగుతాయని, ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఈఓ మురారెడ్డి, సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, ఏఈఓ వర్మ, ఏవో వి. అశోక్ కుమార్, ఎస్. వీఆర్వో శ్రీనివాస్ గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# నాటు సారాయి స్థావరంపై ఎక్సైజ్ సీఐ శివ ప్రసాద్ మెరుపుదాడి

**ప్రజా ఆరోగ్యానికి పరిరక్షకుడిగా నిలుస్తున్న ఎక్సైజ్ సీఐ**
**సర్కిల్ పరిధిలో సారా నిర్మూలనే లక్ష్యమంటున్న సీఐ**



**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 29 :** నాటు సారా యి దుశ్చర్యలను అంతం చేసేందుకు ఎక్సైజ్ శా ఖ చేపడుతున్న చర్యలు మరింత ఉధృతమ య్యా యి. ఇందులో ముందుండి పోరాటం చేస్తూ ప్రజా ఆరోగ్యానికి పరిరక్షకుడిగా నిలుస్తున్నారు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శివ ప్రసాద్. ప్రత్తి పాడు మండలం తోటపల్లి శివారులో ఇటీవల నిర్వహించిన మెరుపుదాడి ఆ విషయాన్ని మళ్లీ తేటతెల్లం చేసింది. పి. శివ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన దాడిలో 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ఆయనే ధ్వంసం చేశారు. నాటు సారాయి ఉత్పత్తి కేంద్రాన్ని గుర్తించిన వెంటనే ఆయన సమర్థవంతమైన కార్యాచరణకు ఆదేశించారు. వాసన ఆధారంగా రహస్యంగా ఉన్న నిల్వలను గుర్తించి, అక్కడ ఏర్పాటు చేసిన కలకత్తా డ్రములు, గుండ్రంగా తయారు చేసిన కుండలు అన్నీ నాశనం చేశారు. ఈ అక్రమ నాటు సారాయి స్థావరానికి సంబంధించి తోటపల్లి గ్రామానికి చెందిన కోరపు నాగేశ్వరరావు అలియాస్ నాగరాజు (తండ్రి పుట్టయ్య) పై కేసు నమోదు చేసి, అతని కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ కేవలం దాడులు నిర్వహించడమే కాకుండా, ప్రజల్లో మద్యం వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరంగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. యువత మద్యం నుంచి దూరంగా ఉండాలని, గ్రామాల్లో ఆరోగ్యవంతమైన జీవనశైలి పెంపొందాలని ఆయన నిరంతరం పాటుపడుతున్నారు. "నాటు సారాయి వ్యాపారానికి ఇక చోటు లేదు" అనే సంకల్పంతో ప్రజా సంక్షేమాన్ని కాపాడుతున్న శివ ప్రసాద్ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఈ దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ పున్నం వంశీ రామ్ మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాల బాలికల్లో చట్టపరమైన అవగాహన జడ్డంగి ఎస్సై చిన్నబాబు

## భద్రత, హక్కులపై స్పష్టత కల్పిస్తూ అభినందనలు అందుకుంటున్న స్థానిక పోలీసు అధికారి




**రాజవొమ్మంగి పెన్ పవర్ జూలై 29:** బాలికలపై సమాజంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులు, ఆన్‌లైన్ మోజు, బాల్యవివాహాల ముప్పు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని జడ్డంగి ఎస్సై చిన్నబాబు పాఠశాలల్లోకి అడుగుపెడుతూ ప్రతిష్టాత్మకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జడ్డంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి పాఠశాలకూ స్వయంగా వెళ్లి విద్యార్థినులతో ముఖాముఖి చర్చలు నిర్వహిస్తూ సురక్షితమైన జీవన శైలి, శారీరక స్వాతంత్ర్యం, చట్టం కలిగిన రక్షణ, శక్తి యాప్ వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం అందిస్తున్నారు.తాజాగా అమీనాబాద్ బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కూడా ఎస్సై చిన్నబాబు పాల్గొన్నారు. గుడ్ టచ్గౌరవిస్తున్నారు బ్యాడ్ టచ్, సోషల్ మీడియా ప్రమాదాలు, బాల్యవివాహాల ముప్పు, పోక్సో చట్టంలోని నిబంధనలు వంటి విషయాలను విద్యార్థినులకు విపులంగా వివరించారు. పిల్లలు ఆసక్తిగా పాల్గొని సందేహాలు వ్యక్తం చేయడం, ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు పొందడం ఈ కార్యక్రమాల ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి. "పోలీసుల నుంచి ఈ స్థాయిలో అవగాహన రావడం చాలా ఉపయోగకరం. బాలికల్లో ధైర్యం పెరుగుతోంది" అని పాఠశాల సిబ్బంది అభిప్రాయపడ్డారు. పాఠశాలలన్నింటికీ వెళ్లే లక్ష్యంతో ఎస్సై చిన్నబాబు తీసుకుంటున్న ముందడుగు బాధ్యతలు, అధికారులు , ఇది తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు ప్రశంసలతో గౌరవిస్తున్నారు.

# పేద కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేత




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** స్థానిక సముద్ర ఫ్లెక్సీ ప్రింటింగ్ కార్యాలయం వద్ద సముద్ర ఫ్లెక్స్ అధినేత గణేష్ ఆర్థిక సాయంతో పేద కుటుంబానికి నిత్యవసర వస్తువులు సమకూర్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పాలచర్ల నాగేంద్ర చౌదరి ముఖ్య అతిథిగా హాజరై శ్రీను కుటుంబానికి నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, మానవసేవే మాధవ సేవగా భావించి అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్న యువ నాయకులు, ఆధ్యాత్మిక సేవకులు పాలచర్ల నాగేంద్ర చౌదరిని స్ఫూర్తిగా తీసుకుని చిరు ప్రయత్నంగా ఈ పేద కుటుంబానికి అన్ని రకాల నిత్యవసర వస్తువులు నాగేంద్ర చౌదరి చేతుల మీదుగా అందజేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుంకర సతీష్, రాజు, సముద్ర ఫ్లెక్స్ ప్రింటింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీపై తప్పుడు ఆరోపణలు మాని సూపర్ సిక్స్ అమలుచేసి చూపించండి

## వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు అల్లు రాజిబాబు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** కూటమి ప్రభుత్వం మంత్రులు, నాయకులు వైసిపి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు అల్లు రాజిబాబు, జగ్గంపేట నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ తోట నరసింహం ఆరోపించారు. మంగళవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను పట్టించుకోలేదని ఇటీవల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మా ప్రభుత్వంలో గోరుముద్దకు 1400 కోట్లు ఖర్చు చేస్తే, 2014- 19 ప్రభుత్వంలో కేవలం 450 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తూ గత ప్రభుత్వంపై నెపం వేస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మాని ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, వైసిపి బూత్ కమిటీల జిల్లా కన్వీనర్ ఒమ్మి రఘురామ్, బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి అనసురి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన ముదునూరి మురళీకృష్ణంరాజు



ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 29 : తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిసారు. పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రాంతీయ, రాజకీయ పరిణామాలు, అభివృద్ధి పనుల పురోగతి, పార్టీ బలోపేతం తదితర అంశాలపై నాయకుల మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తన స్థాయిలో కృషి చేస్తున్నట్లు మురళీకృష్ణంరాజు తెలిపారు.

## బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మ



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 29:** గ్రామస్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జగ్గంపేట నియోజకవర్గం బిజెపి ఇన్చార్జ్ దాట్ల కృష్ణవర్మ అన్నారు. దాట్ల కృష్ణ వర్మ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శుభ సందర్భంలో కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో మండలంలోని పలువురు బిజెపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిర్లంపూడి మండలం బిజెపి నాయకులను ఉద్దేశించి దాట్ల కృష్ణవర్మ మాట్లాడుతూ బిజెపి అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని మీ అందరి సహకారంతో గ్రామస్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాన న్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు కంటా కాశీ విశ్వనాథం, ఐ. వి.వి. సత్యనారాయణమూర్తి, గోనేడ ఎంపీటీసీ మెంబర్,బిజెపి నాయకులు అల్లు శివరామకృష్ణ , ఉపాధ్యక్షులు కోనేటి శ్రీనివాసరావు, బుద్ధ పెద్దకాపు, కోశాధికారి పెదగాడ లోవరాజు, కార్యదర్శులు బుద్ధ సత్యనారాయణ, బొడ్డేటి చిన్నబ్బాయి, ఆడారి రామచంద్ర రావు, పెంటకోట సత్యనారాయణ, అతికం శెట్టి సత్యనారాయణ, మారిశెట్టి త్రిమూర్తులు, అద్దాల బాబ్జి, మండలంలోని పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని దాట్ల కృష్ణ వర్మ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విద్యార్థి పుట్టినరోజు వేడుకలు

### పాఠశాలకు వాల్ ఫ్యాన్లు విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ



**గంగవరం, పెన్ పవర్, జూలై 30:** మండలంలోని పిండికొండ వీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి గౌతమ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి గౌతమ్ తో కేక్ కటింగ్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు లావణ్య, మురళి పాఠశాలకు రెండు వాల్ ఫ్యాన్లు, విద్యార్థులకు ఎగ్జామ్ ఫ్యాడస్ పంపిణీ చేశారు.

## ఇంటివద్దకే రేషన్ సరకులు పంపిణీతో వృద్ధులకు మేలు..



**ఎటపాక పెన్ పవర్ జూలై 29:** వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయడం వల్ల వారికి మేలు కలుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రయోజనకరమని ఎటపాక మండల తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కణితి మధు అన్నారు. మండల పరిధిలో లక్ష్మీపురం పంచాయతీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు పౌరసరాపరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల .శిరీష దేవి భాస్కర్ల ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరుకులు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కణితి మధు మాట్లాడుతూ ప్రతి నెల గ్రామాలలో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ డీలర్ ద్వారా రేషన్ బియ్యం సరుకులు అందించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా అర్హర్షించదగ్గ నిర్ణయమని కనితి మధు అన్నారు లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో ఉన్న వృద్ధులకు ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి ఇంటింటికి తిరిగి రేషన్ డీలర్ తెల్ల%శీ% సీతామహాలక్ష్మి రేషన్ బియ్యం సరుకులు అందించడం అభినందనీయమని మధు అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు ఉండేటి రమేష్, ఉండేటి మోహన్ రావు.తోటమల్ల వెంకటేష్. గోగులోత్ శీను. లక్ష్మీపురం పంచాయతీ పెద్దలు సొందే రమేష్. తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



### జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/ గంగవరం,పెన్ పవర్,జూలై 29:** జిల్లా సమగ్ర అభివృద్దే లక్ష్యంగా అధికార యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు.మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు మందిరంలో విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్,గృహ నిర్మాణ శాఖ,వ్యవసాయశాఖ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం,డి.ఆర్.డి.ఏ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, బిఎస్ఎన్ఎల్,నీతి ఆయోగ్ బృందంతో ఆకాంక్ష జిల్లా అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాంక్ష జిల్లా అభివృద్ధిలో భాగంగా జిల్లాకు రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. పని తీరు పురోగతి డాటాను సక్రమంగా నమోదు చేస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు.అభివృద్ధి డేటాను సక్రమంగా నమోదు చేయకపోతే నిధులు విడుదల జరగదని అన్నారు.ఏ శాఖలో సాధించిన పురోగతి పాయింట్ల మేరకు నిధులు విడదల చేసారో ఆశాఖ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పురోగతి లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు.విద్యారంగంలో పురోగతి సాధించాలని చెప్పారు. విద్యా సంస్థలకు తాగునీరు, విద్యుత్తు, అదనపు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పాఠశాలల్లో బేస్ లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని సంబందిత డేటాను సక్రమంగా సంబంధిత పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. గర్భవతులు రిజిస్ట్రేషన్ పక్కాగా జరగాలని అన్నారు.ఈ సమావేశంలో సిపిఓ ప్రసాద్,ఎస్ఓ వెంకటరావు,పిహెచ్ ఓ ఎ.రాజశేఖరం, డిఇఓ పి.బ్రహ్మాజీ రావు,జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎన్.నంద్, డ్వామా పిడి డా. విద్యాసాగర్, సర్వశిక్ష ఎపిసి డాక్టర్.స్వామి నాయుడు, ఐసిడిఎస్ పిడి ఝాన్సీ,నీతి ఆయోగ్ బృందం నారాయణ రెడ్డి,క్రిష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# కాజులూరులో బీజేపీకి బలం

కొత్త జిల్లా కార్యవర్గంలో మూడు కీలక నియామకాలు

సలాది వీరబాబు, కొప్పన లక్ష్మి, పైడికొండల రామకృష్ణకు జిల్లా స్థాయిలో పదవులు

సంఘటిత శక్తితో ప్రజల్లోకి బీజేపీని తీసుకెళ్లాలి: మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ





**కాజులూరు, పెన్ పవర్,జూలై 29:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కోనసీమ జిల్లా పార్టీ తాజాగా ప్రకటించిన జిల్లా కార్యవర్గంలో కాజులూరు మండలానికి చెందిన నేతలు మూడు కీలక పదవులకు ఎంపిక కావడం హర్షణీయమైన విషయమని మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ తెలిపారు.ఈ మేరకు సలాది వీరబాబు ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా, కొప్పన లక్ష్మి ను జిల్లా ఉపాధ్యక్షురాలిగా, పైడికొండల రామకృష్ణ ను జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించారు.ఈ నియామకాలకు శివాజీ స్పందిస్తూ, "ఇది కాజులూరు మండలానికి గర్వకారణం. మా మండల నేతలు జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడమంటే మా కార్యకర్తల కృషికి పురస్కారం" అని అన్నారు. అనంతరం శివాజీ మండల వ్యాప్తంగా కార్యకర్తలతో కలిసిపై నాయకులను కలిసిఅభినందనలు తెలిపారు. బీజేపీ కాజులూరు మండలంలో వేగంగా విస్తరిస్తోందని, ప్రతి బూత్‌లో పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానం మండలాన్ని గుర్తించడం తమపై మరింత బాధ్యతను కల్పించిందని ఆయన పేర్కొన్నారు. "సేవా, సమర్పణ భావంతో పార్టీని బలోపేతం చేయాలి. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలంటే కార్యకర్తలంతా సంఘటితంగా పనిచేయాలి," అని శివాజీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ, మండల కార్యదర్శి బండారు సత్యనారా యణ, మండల ఉపాధ్యక్షులు, జిల్లా నాయకురాలు తలాటం అమ్మాజీ, పోలిశెట్టి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎస్.వి. కృష్ణమాచార్యులు, మహిళా కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాజులూరులో బీజేపీని ప్రజల్లోకి మరింత దగ్గర చేయడమే తమ లక్ష్యమని, కొత్త నాయకత్వంతో ఇది మరింత వేగంగా సాధ్యమవుతుందని పార్టీ శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేశాయి.

## ఆపరేషన్ కుట్లు వికటించాయన్న ఆరోపణపై ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ

కుట్లువేసిన దారం కారణంగానే ఇన్ఫెక్షన్

ఏడాదిగా తీవ్ర అనారోగ్యంతో అవస్థలు

విచారణ కమిటీ ఎదుట గోడువెళ్ళబోసుకున్న బాధితులు




**గోకవరం, పెన్ పవర్, జులై 29:** కూలీనాలీ చేసుకునేవాళ్ళం ఉచితంగా డెలివరీ ఆపరేషన్ చేయించుకోచ్చని తమ బిడ్డలకు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయిస్తే ఆపరేషన్ కుట్లు వికటించి తమ బిడ్డలు తీవ్ర అనారోగ్యం పాలయ్యార ని,ఇలా అయ్యిందని ఇదే ఆసుపత్రికి మూడు నాలుగు సార్లు తిరిగినా ఆసుపత్రి వైద్యులు పట్టించుకోలేదని తప్పనిసరి పరిస్థితుల్లో లక్షలు ఖర్చుచేసి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నామని విచారణ కమిటీ ఎదుట బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు.సోమవారం గోకవరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో బాధితురాలు గండికోట అనంతలక్ష్మి భర్త అందజేసిన అర్జీపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం విచారణ కమిటీ సభ్యులు డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ కోటేశ్వరి, డాక్టర్ ప్రమీల ఆసుపత్రిలో విచారణ నిర్వహించారు.సమాచారం తెలుసుకున్న మరో ఐదుగురు బాధితులు విచారణ కమిటీని కలిసి తమ ఆరోపణలను లిఖితపూర్వకంగా వారికి అందజేశారు. బాధితుల కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ అనంతరం కుట్లు వేసినచోట చీము పట్టడంతో తిరిగి ఆసుపత్రికి వస్తే వైద్యులు పట్టించుకోలేదని దీంతో తప్పని పరిస్థితుల్లో ప్రయివేటు ఆసుపత్రికి వెళ్ళామని అక్కడ పరీక్షలు చేసి కుట్లు వేసిన దారం కారణంగానే ఇన్ఫెక్షన్ సోకిందని ప్రయివేటు ఆసుపత్రి వైద్యులు చెప్పారని,లక్షల రూపాయలు ఖర్చుచేసి చికిత్స చేయించుకోవలసి వచ్చిందని చెప్పారు.

# "నా భూమికి రక్షణ ఇవ్వండి"

రైతు వినోద్ కుమార్ రెడ్డి రిలే నిరాహార దీక్ష.. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. పోలీసు రక్షణ లేదని రైతు ఆవేదన







**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 29 :** ప్రత్తిపాడు మండలం ఇ.గోకవరంలో ఓ రైతు న్యాయపరమైన హక్కులను రక్షించుకోవడానికే రిలే నిరాహార దీక్ష చేపట్టాల్సి రావడం ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, ప్రభుత్వ రికార్డుల్లో తన పేరిట రిజిస్ట్రేషన్, 1బీ, అడంగల్, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ తన భూమిని సాగుచేసేందుకు రక్షణ లేకుండా పోవడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోందని రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**హక్కులతో కూడిన భూమి..**

**-పోలీసు రక్షణ లేదు**

2016లో కుచుమంచి ఉమామహేశ్వరరావు వద్ద నుండి 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్నానని అయినప్పటికీ స్థానికంగా ప్రభావవంతమైన చింతాకుల భాస్కరరావు, ఆయన కుమారుడు ధర్మాజీ ఆ భూమిపై తమకే అధికారం ఉన్నట్టు నటిస్తూ పంటను ధ్వంసం చేస్తున్నారని వినోద్ కుమార్ ఆరోపిస్తున్నారు. అంతేకాదు, పోలీసుల సహకారంతోనే తన పంటలను ధ్వంసం చేసి, తనపై దాడులు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలున్నా, ప్రత్తిపాడు పోలీసులు స్పందించకపోవడంపై రైతు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**దాడులు.. కేసులు.. కానీ చర్యలు ఎక్కడ?**

పలుమార్లు తన పంటను ధ్వంసం చేసిన తర్వాత ప్రతిసారీ కేసులు నమోదైనప్పటికీ, పంట నాశనం చేసిన వారిపై ఎలాంటి శిక్షార్ధక చర్యలు తీసుకోవడం లేదని రైతు వాపోతున్నారు. ఇది పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని క్షీణింపజేస్తోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. "న్యాయంగా కొనుగోలు చేసిన భూమిలో పంట వేయాలన్నది నా న్యాయహక్కు. దాన్ని రక్షించడానికి దీక్షే మార్గమైందంటే ఇది ఈ వ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తుందని రైతు సత్తి వినోద్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రిలే దీక్షతో స్పందన రాకపోతే...**

తన కుటుంబ ఆస్తి అయిన ఈ భూమిని కాపాడుకునేందుకు చివరికి రిలే నిరాహార దీక్ష చేపట్టిన వినోద్ కుమార్ రెడ్డి ప్రత్తిపాడు పోలీస్ శాఖ, స్థానిక వ్యవసాయ శాఖ, మరియు ప్రభుత్వ మేధోవర్గాల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రజల హక్కులకు రక్షణ ఇవ్వడం పోలీసుల బాధ్యత. హైకోర్టు ఆదేశాలున్నా సరైన చర్యలు తీసుకోకుండా, రైతు నిరంతరం పంట నష్టాల భారం మోయాల్సి రావడం దారుణం. ఇప్పటికైనా పోలీస్ వ్యవస్థ మేల్కొని, బాధితుడికి న్యాయం చేయాలి. లేకపోతే, ప్రజాస్వామ్యంలో చిన్న రైతులే నలిగిపోతారన్న ముద్ర మరింత బలపడుతుంది.

## తిరుమాలి సచివాలయ సిబ్బందిని సన్మానించిన గ్రామ సర్పంచ్



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 29:** మండల పరిధి తిరుమాలి గ్రామంలో విశేష సేవలందించిన సచివాలయ సిబ్బందిని గ్రామ సర్పంచ్ సూతి వీర కృష్ణ ప్రసాద్ మంగళవారం ఘనంగా సన్మానించారు. గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సేనాపతి అజయ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా పని చేసిన ఆత్మకూరి మణికంఠ లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధిలోనూ, ప్రభుత్వ పథకాల అమల్లోనూ చురుకుగా పనిచేసి ప్రజా మన్ననలను పొందారు. ఇటీవల వీరు తిరుమాలి సచివాలయంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై రామవరం,బురుగుపూడి గ్రామాలకకు వెళ్తున్న సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ గ్రామ సర్పంచ్ ప్రసాద్ సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొని పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ తిరుమాలి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వర్తించడంలో ప్రజా మనలను పొందారు అన్నారు. ఉద్యోగ బాధ్యతలో బదిలీలు సహజమని బదిలీపై వెళ్లే గ్రామంలో కూడా ప్రజలకు అందు బాటులో ఉంటూ మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న ప్రసాద్, యర్రా బుల్లి వీర్రాజు, బద్ది బాబి, కానూరు దుర్గాప్రసాద్, కానూరు బ్రహ్మ నందం, చవ్వాకుల నాగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## పీఎంశ్రీలో ఉత్తమ స్కూల్‌గా జగ్గంపేట గురుకుల పాఠశాల

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** జగ్గంపేట బాలయోగి వెలుగు (గురుకుల పాఠశాల) కాకినాడ జిల్లాలో పీఎంశ్రీలో ఉత్తమ పాఠశ లగా ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలో నిర్వహిం చిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి వర్చువల్ గా ప్రారంభించగా జగ్గంపేట గురుకుల పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి లలిత కుమారి, ఎస్ఎంసి చైర్మన్ ఐ.సుజాత ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 26 స్కూళ్లు పీఎం శ్రీ కి సెలెక్ట్ అయ్యాయని అయితే గతంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గా పనిచేసిన రాజకుమారి విశేష కృషితో ఈ పాఠశాలలో పీఎం శ్రీ నిధుల ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కెమిస్ట్రీ ల్యాబ్, ఇంకుడు గుంతలు తదితర వాటిని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఈ నాగమోహన్, ఏఎంఓ, ఎంఈఓ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పార్లమెంటులో రాష్ట్ర ప్రాధాన్య అంశాలపై దృష్టి

## అభివృద్ధికి కట్టుబడిన ఎంపీ సానా సతీష్ బాబు

## కాకినాడ అభివృద్ధి, ఖనిజ వనరుల వినియోగం

## యువతకు అవకాశాల కల్పనపై స్పష్టత

**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, జూలై 29:** రాష్ట్రాభివృద్ధికి అవసరమైన అంశాలను పార్లమెంట్ వేదికగా ఉద్ధరిస్తూ కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడంలో రాజ్యసభ సభ్యులు శ్రీ సానా సతీష్ బాబు కీలకంగా వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జూలై 28, 29 తేదీల్లో రాజ్యసభలో ఆయన ప్రశ్నించిన పలు అంశాలకు కేంద్ర మంత్రులు ఇచ్చిన సమాధానాలు రాష్ట్రానికి,ముఖ్యంగా కాకినాడకు ప్రగతికి దోహదపడేలా ఉన్నాయి.కాకి నాడకు స్మార్ట్ సిటీలో ప్రత్యేక స్థానం స్మార్ట్ సిటీస్ మిషన్ పరిధిలో కాకినాడకు రూ.490 కోట్లు విడుదలైందని, వీటిలో 99 శాతం నిధులు వినియోగించి నగరాన్ని దేశంలో ఉత్తమ స్మార్ట్ సిటీలలో ఒకటిగా నిలబెట్టినట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకహాన్ సాహూ రాజ్యసభలో తెలిపారు.పట్టణ రవాణా, మురుగు నీటి శుద్ధి, సరస్సుల అభివృద్ధి, డిజిటల్ పాలన వంటి రంగాల్లో గొప్ప పురోగతి సాధించినట్లు వెల్లడించారు. వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణకు చర్యలు: ఆంధ్రప్రదేశ్‌లో నికెల్, రెయిర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి ఖనిజాల కోసం నాలుగు ఎన్ఎంఈటీ (ఎన్ఎంఈటి) ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, వీటి కోసం ఇప్పటివరకు రూ.11 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధాన మిచ్చారు.రాష్ట్ర ఖనిజ వనరుల శాస్త్రీయ వినియోగానికి ఇది తోడ్పడుతుందని తెలిపారు.ఎరువుల రవాణాలో కాకినాడ పోర్ట్ ప్రధాన పాత్ర కాకినాడ డీప్ వాటర్ పోర్ట్ రోజుకు 20,000 టన్నుల ఎరువులను దిగుమతి చేసుకునే సామర్థ్యం కలిగి ఉందని, ఆటోమేటెడ్, క్లోజ్డ్ వేర్‌హౌస్ వ్యవస్థతో దేశంలో టాప్ 3 పోర్టుల్లో ఒకటిగా నిలిచిందని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. కొత్త ఎరువుల పోర్ట్ అవసరం లేదని, కాకినాడ సదు పాయాలు పూర్తిగా సరిపోతాయని స్పష్టత ఇచ్చారు.ఇంటర్న్‌షిప్ స్కీమ్‌లో 8,700 మందికి అవకాశం పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ (పి ఎం ఐ ఎస్) మొదటి దశలో 6.21 లక్షల దరఖాస్తులు అందగా, 82,000 మందికి ఆఫర్లు, 8,700 మందికి ఇంటర్న్‌షిప్‌లు ప్రారంభమయ్యాయని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. రెండో దశలో కూడా కొత్తగా 72,000 ఆఫర్లు వెలువడ్డాయని వెల్లడించారు. గ్రామీణ యువత, మహిళలు, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలిపారు.కమల్ హాసన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ.తాజాగా రాజ్యసభకు ఎన్నికైన ప్రముఖ నటుడు, ఎంఎన్ఎం పార్టీ అధ్యక్షుడు శ్రీ కమల్ హాసన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ



సందర్భంగా ఇద్దరూ ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూల చర్చలు జరిపినట్లు సమాచారం. పార్లమెంట్ వేదికగా రాష్ట్రానికి అవసరమైన అభివృద్ధి, పెట్టుబడులు, యువత అభ్యున్నతి తదితర అంశాలపై తీక్షణమైన దృష్టితో పనిచేస్తున్న ఎంపీ సానా సతీష్ బాబు వ్యవహారం ప్రశంస నీయమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రజా అవసరాలను కేంద్రానికి చాటి చెప్పే నేతగా ఆయన ప్రొఫైల్ మెరుగవుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ముమ్మిడివరం రోడ్ల చెంత...చెట్ల కొమ్మలు



## అయిదు రోజులుగా ఎక్కడి చెట్ల కొమ్మలు అక్కడే...

## పట్టించుకోని నగర పంచాయతీ

**ముమ్మిడివరం పెన్ పవర్ జూలై 29 :**ముమ్మిడివరం నగర పంచాయతీలో విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూసేందుకు విద్యుత్ శాఖ వారు ఎక్కడికక్కడ విద్యుత్ తీగలపైకి పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టింది. తొలగించిన చెట్ల కొమ్మలను రోడ్డు ప్రక్కన వేసారు. మరుసటి రోడ్డు మున్సిపాలిటీ వారు తొలగిస్తారనే అందరూ అనుకున్నారు. తొలగించిన చెట్ల కొమ్మలను మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది మాకేంటి సంబంధం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం చెంతనే మొక్క కొమ్మలు ఉన్నా మున్సిపల్ కమీషనర్ గాని, పారిశుధ్య సిబ్బంది కాని పట్టించుకోలేదు.వ్యాపార బడ్డీ షాపులకు వద్ద మొక్క కొమ్మలు పడి ఉన్నా ఇక్కడ మున్సిపల్ అధికారులు పనిచేస్తున్నారా? అన్న సందేహం మున్సిపల్ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ రవి వర్మ ను ప్రశ్నించగా ట్రాక్టర్ కు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈరోజు సాయంత్రం లోపు చెట్ల కొమ్మలను తరలిస్తామని అన్నారు. అయితే మంగళవారం చెత్తను చెట్ల కొమ్మలను నగర పంచాయతీ మున్సిప కార్మికులు తరలించకపోవడంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నియమం 377 ప్రకారం పార్లమెంట్‌లో కోరిన ఎంపీ హరీష్ బాలయోగి



## కోనసీమలో కొబ్బరి ఉత్పత్తి సంస్థలు నెలకొల్పండి

**అమలాపురం పెన్ పవర్ జూలై 29:** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జీవనోపాధిగా సాగుతున్న కొబ్బరి పంటల ఉత్పత్తుల ద్వారా రైతులకు మేలు చేసేందుకు జిల్లాలో కొబ్బరి ఉత్పత్తి సంస్థలు నెలకొల్పాలని అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి కోరారు.నియమం 377 ప్రకారం పార్లమెంట్ లో సభాపతిని కోరినట్లు ఆయన తెలిపారు.ఆంధ్రప్రదేశ్ లో అనేక జిల్లాల్లో ముఖ్యంగా కోనసీమలో కొబ్బరి సాగు గ్రామీణ ప్రజలకు జీవనోపాధికి వెన్నెముక లాంటిదనారు.ఆంధ్ర రాష్ట్రంలో మొత్తం కొబ్బరి ఉత్పత్తిలో దాదాపు సగం వాటా కోనసీమదేనని చెప్పవచ్చన్నారు.అనేక జిల్లాల్లో గణనీయ స్థాయిలో ఉత్పత్తి ఉన్నప్పటికీ రైతులు తమ ఉత్పత్తులను పూర్తి విలువను పొందడానికి స్థానికంగా అవసరమైన మద్దతు లేదన్నారు.కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటైన కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘాలు(CPS), సమాఖ్యలు(CPF), కంపెనీలు (CPC),సామూహిక మార్కెటింగ్,వ్యయ సామర్థ్యం, ఉత్పత్తి విలువను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.గత అయిదు సంవత్సరాలలో కేవలం సీపీఎస్ లు మాత్రమే నమోదు చేయబడ్డాయని ప్రస్తుతం వాటిలో ఒక్కటి కూడా పనిచేయడం లేదన్నారు.2019 నుండి ఒక్క సీపీఎఫ్,సీపీసీ కూడా ఏర్పాటు చేయలేదని చెప్పారు.అందుచేత కొబ్బరి రైతులు పూర్తి స్థాయిలో ఆదాయం పొందలేక పోతున్నారని అన్నారు.ఆంధ్రప్రదేశ్ లోని కొబ్బరిచెట్ల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వేల మంది డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి అభివృద్ధి బోర్డు సంస్థలను ఏర్పాటు చేసి విధంగా చర్యలు తీసుకుంటే కొబ్బరి రైతుల ఆదాయం పెంచడంతో పాటుగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వీలుంటుందని సభాపతిని ఎంపీ హరీష్ బాలయోగి కోరడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.

# కడకట్ల గురుకుల పాఠశాల పీఎం శ్రీకి ఎంపిక

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 29:**పీఎం శ్రీ పథకానికి కడకట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎంపికైంది. నూతన విద్యా విధానం 2020లో భాగంగా నూతన విధానంలో అన్ని విషయాలు అమలు చేయడానికి పిఎం శ్రీ స్కూల్ స్కీమును భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పాఠశాలలో నాణ్యమైన విద్య మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ఈ స్కీమును భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో మొదటి దశగా ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ స్కూల్ ఎంపిక చేశారు. ఇప్పుడు ఈ పాఠశాల జిల్లాలోని 26 పిఎం శ్రీ పాఠశాలలో మొత్తం పాఠశాలగా ఎంపికైంది. పియం శ్రీ స్కూల్లో ప్రతి జిల్లా నుంచి జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయగా రాష్ట్రంలోని 26 పాఠశాలలు ఎంపిక ప్రతి జిల్లా నుండి ఒక జిల్లా ఉత్తమ పాఠశాలను ఎన్నుకున్నారు. జాతీయ విద్యా విధానం 20 20 లో ఐదు సంవత్సరాలు ఆయన సందర్భంగా జరుగుతున్న జాతీయ ఉత్సవాల్లో భాగంగా జిల్లా ఉత్తమ పాఠశాలన్నింటిని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సహాయం మంత్రులు డాక్టర్ సుఖాంత్ మజుంధార్ , జయంత్ చౌదరి ఉక్కు శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, స్థానిక



ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వీడియో సమావేశం ద్వారా ఢిల్లీ నుంచి జాతికి అంకితం చేశారు. పాఠశాల లో ఈ కార్యక్రమానికి డిఇఓ నారాయణ సమగ్ర శిక్ష ఏపీసి శ్యాంసుందర్ ఏ ఎం ఓ సుబ్రమణ్యం మండల విద్యాశాఖ అధికారి హనుమ పాఠశాల పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ ఇందిరా పాల్గొన్నారు. పాఠశాలలో కల్పించి మౌలిక సదుపా యాలను ఉపయోగించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని డిఇఓ నారాయణ కోరారు. జిల్లాలో అన్ని పాఠశాలలు పరిశీలించిన తర్వాత కడకట్ల ఆంధ్రప్రదేశ్



సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలను జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసామని ఏపీఎస్ శ్యాంసుందర్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఐఎఫ్‌ఎస్సి ద్వారా కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం అధికారులు విద్యార్థుల సమక్షంలో శిలాఫలకం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ బి.రాజారావు మాట్లాడుతూ ఈ పాఠశాల పీఎం శ్రీ ఉత్తమ పాఠశాలగా ఎన్నుకోవడమే కాకుండా కేంద్ర విద్యా శాఖ మంత్రి చేతులమీదుగా జాతికి అంకితం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కి అభినందనలు తెలిపారు.

# జగ్గంపేట డిగ్రీ కళాశాలలో పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని స్కిల్ హబ్ ద్వారా జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ ఫీల్డ్ టెక్నిషియన్ హెరీమ్ అప్లయన్సెస్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.చెన్నారావు తెలిపారు. దీనికి బి.టెక్ (ఎలక్ట్రికల్ లేదా ఎలక్ట్రానిక్స్), డిప్లొమా (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్) అర్హత అన్నారు. హెరీమ్ అప్లయన్సెస్ (ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, మైక్రోవేవ్, ఏ.సీ. తదితర వాటిని అమర్చడం, మర మ్మతులు, వాటి నిర్వహణ చూడడం, విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించడం, ఫీల్డ్ వర్క్, డెమో సెషన్ల నిర్వహణ, శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, అర్హతలకు సంబంధించిన సర్టిఫికేట్ల నకళ్ల తో దరఖాస్తును జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆగస్ట్ 1వ తేదీలోగా సమర్పించాలన్నారు.

# విలేకరిపై క్రిమినల్ కేసు నమోదు

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 29:** కాకినాడ జిల్లా జగ్గంపేట గ్రామానికి చెందిన మల్లువలస ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విలేకరి ఆకుల సోమశేఖర్ పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేటకు చెందిన ఈశ్వరరావు రాజమండ్రి రోడ్డులో షాపు నిర్మించుకోవడం జరుగుతుందన్నారు. అయితే ఆ నిర్మాణంలో జగ్గంపేటకు చెందిన ఆకుల సోమశేఖర్ అనే వ్యక్తి తాను విలేకరునని షాపు ఇక్కడ కట్టేందుకు వీలులేదని అతనిని తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం జరిగిందన్నారు. ఈశ్వరరావు షాపు నిర్మాణం చేసుకోవాలంటే తనకు రూ.50వేలు ఇవ్వాలని లేకపోతే ఈశ్వరరావుపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి బ్లాక్మెయిల్ చేసి డిమాండ్ చేయడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో ఈశ్వరరావు ఆకుల శేఖర్ అనే వ్యక్తికి పదివేల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు. అయినా సరే అతను ఇంకా ఎక్కువ డబ్బులు ఇవ్వాలని పలుమార్లు అతన్ని ఇబ్బందులకు గురి చేయడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై జగ్గంపేటకు చెందిన ఆకుల సోమశేఖర్ అనే విలేకరిపై క్రిమినల్ కేసును నమోదు చేసి దర్యాప్తు జరుగుతుందని ఎస్సై తెలిపారు.

# ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ

## జాతీయ హాకీ టోర్నీకి జిల్లా యంత్రాంగం సిద్ధం

## జూలై 30 నుంచి ఆగస్టు 20 వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## సమన్వయంతో పనిచేయండి: డీఆర్వో వెంకటరావు




**కాకినాడ, పెన్ పవర్, జూలై 29:** కాకినాడలో ఆగస్టు నెలలో జరగనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ మరియు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్ టోర్నీలను పటిష్ఠంగా నిర్వహించేందుకు జూలై 30 నుంచి ఆగస్టు 20 వరకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జె. వెంకటరావు తెలిపారు.ఈ మేరకు మంగళవారం కాకినాడ కలెక్టరేట్లో వైద్య ఆరోగ్యం,పోలీస్, పౌరసరఫ రాలు తదితరశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ,ఆగస్టు 1 నుంచి 12 వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్, ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ,కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరగనున్నాయని పేర్కొన్నారు.ఒకేసారి రెండు ప్రాముఖ్యమైన కార్యక్రమాలు నిర్వహించనున్న దృష్ట్యా ఎటువంటి అంతరాయాలు లేకుండా నిర్వహణ జరగాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌ను 24x7 మూడు షిఫ్టుల్లో కొనసాగించేం దుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.ఈ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణకు: ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు సెట్రాజ్ సీఈవో మల్లికార్జునరావు,రాత్రి 10 నుంచి తదుపరి ఉదయం 10 గంటల వరకు గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణపర్యవేక్షణ అధికారులుగా విధులు నిర్వర్తిస్తారని వెల్లడించారు. వీరికి సహాయకులుగా ఆయా శాఖల సిబ్బంది మోహరించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలి అని డీఆర్వో సూచించారు.సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ. శ్రీనివాస రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 29:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆగస్టు ఆరవ తేదీన జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం కొండలరావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , జిల్లా ఉపాధి సంస్థలు సంయుక్తంగా జిల్లా లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిపాదు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ ఆధ్వర్యంలో ఏలేశ్వరం గవర్నమెంట్ జూనియర్ కాలేజీ లో ఆగష్టు 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం కొండలరావు ఆ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపనీలు హాజరుకానున్నాయని వారు తెలిపారు. వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గలవారు అర్హులు. ఆ రోజున నిర్వహించే జాబ్ మేళా కు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుంది. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆసక్తి,తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి సదరు " జాబ్ మేళా" కు రెజ్యూమ్ తో పాటు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో, సిద్ధపడి ఆగష్టు "6వ" తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ వద్దకు రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు , జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు "8688977277." 8247788247" నంబర్ల ను సంప్రదించాలని సూచించారు.

# బందనపూడి గ్రామ అభివృద్ధికి నిధుల కోసం మంత్రిని కలిసిన సర్పంచ్ తిరుమలవేణి

**కాజులూరు, పెన్ పవర్,జూలై 29:** బందనపూడి గ్రామ సర్పంచ్ తిరుమలవేణి సత్యనారాయణ గ్రామ అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన మౌలిక సదుపాయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం మరియు సీసీ రోడ్ అభివృద్ధి పనులకు నిధులు



మంజూరు చేయాలన్న అభ్యర్థనను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం సానుకూలంగా స్పందిస్తూ, ప్రజల అవసరాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పటిష్ఠంగా ముందుకు సాగుతుందని, బందనపూడి గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిబద్ధతతో ఉన్నదని స్పష్టంగా తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. సర్పంచ్ దేగల తిరుమలవేణి విజ్ఞప్తిపై సంబంధిత శాఖలతో సంప్రదించి త్వరితగతిన నిధుల మంజూరు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెవెన్యూ డివిజనల్ అధికారి సమీక్ష సమావేశం

**కొత్తపేట, పెన్ పవర్, జూలై29:** భారత ఎన్నికల సంఘం, న్యూఢిల్లీ వారి మార్గదర్శకాలు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, వెలగపూడి, ఆంధ్రప్రదేశ్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి ఆదేశాల మేరకు, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం నం.47 లో ఓటర్ నమోదు అధికారిగా వ్యవహరిస్తున్న రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సహాయ ఓటర్ నమోదు అధికారులు, తహశీల్దార్లు - ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు ,డిప్యూటీ తహశీల్దార్ కొత్తపేట వారు పాల్గొన్నారు.

**ఈ సమావేశంలో చర్చించిన ప్రధాన అంశాలు ఈవిధంగా ఉన్నాయి:** ఎస్.ఎస్.ఆర్. 2025 ప్రకారం బూత్ లెవెల్ అధికారులు (బి ఎల్ వో లు )నియామకం పూర్తయినదిగా తెలియజేయబడింది. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 2,లక్షల52వేల581గా ఉంది. బూత్ లెవెల్ ఏజెంట్లు ,(బిఎల్ఎ )లు తమ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఫారాలు 6, 7, 8 క్లైమ్స్ వివరాలు తెలుసుకొని, అభ్యంతరాలుంటే వెంటనే బిఎల్‌వోలుకు తెలియజేయాలని సూచించారు. బిఎల్‌వోలు వద్ద ఏఈఆర్ఓ కార్యాలయంలో తుది ఫోటో ఓటర్ల జాబితాలు లభ్యమవుతాయి. అందులో తమ వివరాలు పరిశీలించి, అవసరమైతే ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణల కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు, సవరణలుపై జరిగే విచారణల సమయంలో తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేయబడింది. 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువత వెంటనే ఓటర్లుగా నమోదవ్వాలని విజ్ఞప్తి చేశారు. బిఎల్‌వోలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లతో సమన్వయంతో క్లైమ్స్ విచారణ జరిపి, ఖచ్చితమైన, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా తయారుచేయాలని సూచించారు. ఈ సమావేశానికి బిజెపి ఐ ఎన్ సి టిడిపి వైయస్సార్సీపి జనసేన, బీఎస్పీ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరై సలహాలు, సూచనలు అందించారు.

## బాబు షూరిటీ మోసంపై గ్యారంటీపై అవగాహన



**పెనుమంట్ర,పెన్ పవర్, జూలై 29:** రాష్ట్రంలో ఇటీవల పెరుగుతున్న షూరిటీ మోసాలు, ఖాతాదారుల భద్రత, గ్యారంటీ బాధ్యతలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు తూర్పుపాలెం వైస్సార్సీపీ క్యాంప్ కార్యాలయం నందు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మాజీ మంత్రివర్యులు శ్రీ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని పోడూరు, పెనుమంట్ర మండలాల కన్వీనర్లు పిల్లి నాగన్న మరియు గూడూరి దేవేంద్రుడు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ ప్రజలు చిన్న అవగాహన లోపం వల్ల లక్షల రూపాయల మోసానికి గురవుతున్నారు. ఖాతాదారులు, గ్యారంటీ ఇవ్వబోయేది, షూరిటీ పట్ల పూర్తి సమాచారం ఉన్న తర్వాత మాత్రమే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి అని తెలిపారు. పెనుమంట్ర ఎంపీపీ వాసు రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి షూరిటీ మోసాలపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటున్నా, ప్రజలలో అవగాహన లేకుంటే అది పూర్తి ఫలితం ఇవ్వదు. అందుకే గ్రామ స్థాయిలోనూ ఈ కార్యక్రమన్ని అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థాయి కార్యకర్తలు, భవిష్యత్తులోగూడూరి దేవేంద్రుడు, మోసాల నుండి రక్షణ పొందాలనుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ప్రధానంగా షూరిటీ మోసాల పద్ధతులు, వాటి ఫలితాలు, బాధితుల న్యాయ పరమైన హక్కులు, పరిహార మార్గాలపై దృష్టిలో సరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సభ్యురాలు సుమంగళి ,పెనుమంట్ర వైస్సార్సీపీ మండల కన్వీనర్ కర్రీ వేణుబాబు, పోతుమూడి రామచంద్రరావు, గుబ్బల వీరబ్రహ్మం, చింతపల్లి గురుప్రసాద్, దొంగ దుర్గాప్రసాద్, బుర్ర రవికుమార్, కుచ్చర్లపాటి పద్మనాభ రాజు, సువర్ణ రాజు, గొట్టుముక్కల రమేష్, గుడాల చంటి, గెద్దాడ ఏకలవ్య, కర్రీ రామలింగారెడ్డి, అల్లం భాస్కర్ రెడ్డి, సత్తి విష్ణు కుమార్ రెడ్డి, తాడిపత్తి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## నూతన వ్యాపార ప్రారంభోత్సవంలో పాల్గొన్న అమలాపురం ముమ్మిడివరం ఎమ్మెల్యేలు



**అమలాపురం టెన్ పవర్ జూలై 29:** నియోజకవర్గం, లోని ఉప్పలగుప్తం మండలం, గొల్లవిల్లి గ్రామంలో శ్రీ లక్ష్మి శ్రీనివాస ఫ్యూయల్స్ భారత్ పెట్రోలియం రిటైల్ అవుట్ లెట్ నూతన వ్యాపార ప్రారంభోత్సవానికి హాజరై యాజమాన్యానికి అభినందనలు తెలియజేసిన, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ శ్రీ అల్లాడ స్వామి నాయుడు . ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి లక్ష్మినారాయణ, అమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఇంచార్జ్ చైర్మన్ జంగా అబ్బయి వెంకన్న, టీడీపీ నాయకులు నల్లా చిట్టిబాబు, గొల్లకోటి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకార సంఘాలు బలోపేతం కావాలి..

### రాజోలు ఎమ్మెల్యే




**అమలాపురం పెన్ పవర్, జూలై 29:** మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో ఎం జి గార్డెన్స్ ఫంక్షన్ హాలు నందు రాజోలు నియోజక వర్గ శాసన సభ్యులు దేవ వరప్రసాద్ అధ్యక్షతన మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన రాజోలు నియోజకవర్గ 33 మత్స్యకార సహకార సంఘాల బలోపేతం, పాలకవర్గ సభ్యుల, మత్స్యకార నాయకుల అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే దేవ ను మత్యకారులు తిరుమాని ఆచార్యులు ఆద్వరంలో శాలువా తో సన్మానించారు. శాసన సభ్యులు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపదయోజనలో భాగంగా ప్రాథమిక మత్స్యసహకార సంఘములను ఫిష్ ఫార్మర్స్ ఉత్పత్తిదారుల సంస్థ గా మార్చి వాటిని బలోపేతం చేసే లక్ష్యంతో అవగాహన సదస్సు, శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపదయోజన ప్రధాన మంత్రి మత్స్య సంపదయోజన పథకం ద్వారా 100 మంది సభ్యులు పైబడిన ప్రతి మత్స్య సహకార సంఘంనకు 5 లక్షల వరకు నిర్వహణ వ్యయం విడతలుగా అందజేయబడుతుందని, సంఘములోని సభ్యుల ఆధారంగా 10 లక్షల వరకు మాచింగ్ గ్రాంట్ మంజూరు చేయబడుతుందని, మత్స్య అనుబంధ సంస్థలు ద్వారా 50 లక్షల నుండి 2 కోట్ల రూపాయల వరకు 7% వడ్డీ తో ఋణాలు మజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య కిషన్ సమృద్ధి సహయోజనపథకం ద్వారా 35 నుండి 100 లోపు సంఘ సభ్యులు వున్న ప్రతి మత్స్య సహకార సంఘం 3 సం. సంఘ తీర్మనములు అందజేయవలసి ఉంటుందని, సంబంధిత శాఖ అధికారులు మాట్లాడుతూ మత్స్యసహకార సంఘాల బలోపేతానికి తోడ్పడే అంశాలను అందుబాటులో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సహకార సంఘ సభ్యులకు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధికారి సిద్ధార్థ వర్ధన్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు,మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గోపాల కృష్ణ, మత్స్యశాఖ సహాయ తనిఖి అధికారి,మామిడికుదురు కొల్లు పెద్ది రాజు, రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి చైర్మెన్ కరణం గంగాధర్, సెంట్రల్ టీమ్ విజయవాడ పిప్పల్ల కోటేశ్వరరావు, ఎన్డీఏ కూటమి నాయకులు, మత్స్యకార సంఘ నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసీపీ నాయకుల భూదందాలు, అరాచకాలు ప్రజలు మర్చిపోలేదు



### భూదందాలు అరాచకాలతో చింతలూరుకు చెడ్డ పేరు తెచ్చారు

### ప్రెస్ మీట్‌లో ఆ నాయకులు మాట్లాడినవన్నీ అబద్ధాలే

### చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధి తెదేపా హయాంలోనే

### ప్రెస్ మీట్‌లో చింతలూరు తెలుగుదేశం నాయకులు

**ఆలమూరు, పెన్ పవర్,జూలై 29:** సోమవారం వైసీపీ నాయకులు మండల కేంద్రం ఆలమూరులో ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్‌లో కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాట్లాడినవన్నీ అసత్యాలే అని చింతలూరు తెలుగుదేశం నాయకులు ధ్వజమెత్తా రు. సీనియర్ నాయకులు వైట్ల శేషుబాబు మాట్లాడుతూ చింతలూరు తెలుగుదేశం నాయకులను చల్లని తల్లి నూకాంబికా అమ్మవారితో పోల్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నా రు. తాము సైతం ప్రజలంతా చల్లగా ఉండాలని కోరుకుంటామని తెలిపారు. వైసీపీ నాయకుల వలే కూటమి నాయకులు ఎవరూ భూదందాలు చేయడం లేదని విమర్శించారు. చింతలూరు వైసీపీ నాయకుడు ఆ ప్రెస్ మీట్ లో మాట్లాడినవన్నీ అసత్యాలే అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక చింతలూరులో కొత్తగా పెన్షన్లు ఇవ్వడం లేదన్నది సరికాదన్నారు. నూతనంగా అర్హుల జాబితా వచ్చిందని, వారిలో 17 మందిలో స్వయానా వైసీపీ నాయకుల కుటుంబ సభ్యురాలైన సోదరికే పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇక ఒక్క చింతలూరు గ్రామంలోని తల్లికి వందనం పథకం కింద 366 మంది విద్యార్థులకు నగదు జమైందని తెలిపారు. ఇంకా 34 మందికి వారి తల్లిదండ్రులకు భూమి ఉండడం, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉండడం, కరెంట్ బిల్లు అధికంగా రావడం వంటి సహేతుకమైన కారణాల వల్ల మాత్రమే తల్లికి వందనం జమ కాలేదన్నారు. ఈ పరిమితులన్నీ గత వైకాపా ప్రభుత్వంలో పెట్టినవేనన్నారు. గత ప్రభుత్వంలో బకాయి పెట్టిన ఫీజు రియంబర్స్మెంట్ సైతం ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క చింతలూరు గ్రామంలోనే 34 మందికి జమ చేయడం జరిగిందన్నారు. చింతలూరు లోని మహిళలు అందరూ కలిసి అమ్మవారికి ఆభరణాలు తయారు చేయాలనే సంకల్పంతో చుట్టుపక్కల గ్రామాలు తిరిగి సుమారు 45 కేజీలు సేకరించి ఆభరణాలు తయారు చేయించారని, అమ్మవారికి సమర్పించారని తెలిపారు. వారితో పోటీగా వెండి మేము సేకరిస్తామంటూ వైసీపీ నాయకుడు సేకరించిన వెండితో ఇప్పటివరకు అమ్మవారికి ఏ ఆభరణము చేయించలేదని, దేవస్థానానికి అమ్మవారికి అప్పగించలేదని విమర్శించారు. దానితో అతనికి వెండి ఇచ్చిన దాతలు సైతం అయోమయంలో ఉన్నారన్నారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఒక కమిటీగా ఏర్పడి సుమారు కోటి రూపాయలు విరాళం సేకరించారని తెలిపారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు అమ్మవారి దేవస్థానానికి 1కోటి రూపాయలు వరకు నిల్వ ఉండేలాగా చేసి 2019లో వైసీపీ ప్రభుత్వానికి అప్పచెబితే, అమ్మవారి ఆలయ అభివృద్ధి నిమిత్తం దేవాదాయ శాఖ గ్రాంట్లు ఇచ్చే సందర్భంలో ఒక్క రూపాయి కూడా దాతలు నుంచి సేకరించలేక, ఆ కోటి రూపాయల నుంచే రూ.60 లక్షలు జమ చేసి గ్రాంట్లు తెచ్చారని అన్నారు. ఇప్పటికీ వైసీపీ నాయకుడు వద్ద జెయింట్ వీల్ మొదలైన వాటికి సంబంధించి రూ.9 లక్షల సొమ్ము ఉందని వాటిని ఇప్పటివరకు అమ్మవారి ఆలయానికి జమ చేయలేదని విమర్శించారు. మండలంలో మడికి మొదలైన గ్రామాల్లో బ్రాహ్మణుల, వైశ్యుల భూములపై పెత్తనం చేసి ల్యాండ్ సెటిల్మెంటులతో చింతలూరు కి చెడ్డ పేరు తెచ్చిన ఘనత వైసిపి నాయకులకే దక్కుతుందన్నారు. మట్టి, ఇసుక దందాలతో చెలరేగిపోయి మాఫియా అవతారమెత్తింది మీరు కాదా అని ప్రశ్నించారు. చెరువు తవ్వి ఆ మట్టి అమ్మవారి భూముల్లో వేసి రూ.3 లక్షల రూపాయలు డ్రా చేసుకున్న ఘనత వైసీపీ నాయకుడికే దక్కిందన్నారు. తెలుగుదేశం నాయకులు కానీ, కార్యకర్తలు కానీ ఏనాడు ఇసుక అక్రమ దందాలు, మట్టి మాఫియాలు, భూ సెటిల్మెంట్లకు పాల్పడలేదని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చింతలూరులో ప్రధాన నాయకుడు మహిళలను, దివ్యాంగులను బెదిరింపులతో మానసిక వేదనకు గురిచేసి పింఛన్లు సైతం ఆపేసిన ఘనుడన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక చింతలూరులో ప్రశాంతత నెలకొందని తెలిపారు. స్వయాన వైసిపి నాయకుడు సోదరుడే ప్రభుత్వ ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా ఉన్న అతను ప్రశాంతంగా ఉద్యోగం చేసుకుంటున్నాడు అంటే కూటమి ప్రభుత్వం కనుకే అన్నారు. ఇదే వైసీపీ ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలు అసలు ఉద్యోగం చేయనిచ్చేవారా? అని ప్రశ్నించారు. వైసిపి నాయకులు వేసిన అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొన్నవారు ఇబ్బందులు పడుతుంటే వారి ఇబ్బందులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పరిష్కరించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా చింతలూరు నూకాంబికా అమ్మవారి అనుగ్రహంతో వైసీపీ నాయకుల మనసు మారాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలతో చింతలూరు గ్రామ ప్రశాంతతను చెడగొట్టవద్దని కోరారు. వైసీపీ కన్నా అనేక రెట్లు కూటమి పాలన బాగుందని ప్రజలే అంటున్నారని గ్రహించాలన్నారు.





## “బాబు షూరిటీ మోసం గ్యారంటీ” కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గి రెడ్డి

### రావులపాలెంలో మండల కన్వీనర్‌గా బొక్కా కరుణాకర్ నియామకం

**రావులపాలెం,పెన్ పవర్ జూలై 29:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “బాబు షూరిటీ మోసం గ్యారంటీ” కార్యక్రమం మంగళవారం కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం మండలంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల బూత్ మేనేజర్ కర్రి గోవింద కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రావులపాలెం మండల నూతన కన్వీనర్‌గా బొక్కా కరుణాకర్ ని నియమించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలను మోసగించిన తెలుగుదేశం పార్టీ నేత బాబు ప్రవేశపెట్టిన షూరిటీ రాజకీయాలను ప్రజల్లో నిగ్గు తేల్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్యకు వెళ్లి ఈ అంశాన్ని వివరించాలని సూచించారు.
కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు సిరిపురపు శ్రీనివాసరావు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ, ఎంపీపీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, చిర్ల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎటపాక నవోదయ విద్యాలయంలో టేబుల్ టెన్నిస్ క్రీడలు ప్రారంభం

ఎటపాక ,పెన్ పవర్, జూలై 29: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల నవోదయ విద్యాలయంలో మంగళవారం అట్టహాసంగా రీజనల్ టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి, ఈ పోటీలకు నాలుగు రాష్ట్రాల నుంచి 96 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగిందని, ఈ టేబుల్ టెన్నిస్ క్రీడలను ఎటపాక మండల ఎంపీడీవో ప్రేమ్ సాగర్ , ఎటపాక జి.ఎం.ఆర్ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీరామ సత్యనారాయణలు ప్రారంభించారని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ కె.టి ప్రసాద్ తెలిపారు, ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎటపాక మండల అధికారులకు నవోదయ విద్యాలయం విద్యార్థులు గౌరవ వందనం చేస్తూ మార్చి పాస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు, అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.... ఎటపాక మండలంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలు జరగటం చాలా సంతోషకరమని మునిపెన్నడూ లేని విధంగా నాలుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు మన నవోదయ విద్యాలయంలో క్రీడలు జరుపుకోవటం మొదటిసారి అని అన్నారు, రాష్ట్రంలో టేబుల్ టెన్నిస్ క్రీడ ఆడటానికి ఎటపాక మండలాన్ని ఎంచుకున్న స్పోర్ట్స్ అథారిటీ కమిటీకి అభినందనలు తెలియజేశారు, ఈ క్రీడా పోటీలకు కృష్ణ, కడప, ఖమ్మం, షిమోగా, తుంకూర్, పతనంతిట్ట, వాయనాడు క్లస్టర్లు పాల్గొనడం సంతోషకరమైన విషయమని అన్నారు, క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు, అనంతరం నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమైనవి క్రీడల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకొని అద్భుతాలను సృష్టిస్తారని మనసును విద్యను సమతుల్యం చేసేవి క్రీడలేనని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో నాలుగు రాష్ట్రాల రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు, ఎటపాక నవోదయ విద్యాలయం నుంచి వివిధ ప్రాంతాలలో జరుగుతున్నటువంటి క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలకు మన విద్యాలయం నుంచి 40 మంది విద్యార్థులు విజయకేతనాన్ని ఎగరవేసి వివిధ ప్రాంతాలలో జరిగే రీజనల్ స్థాయి ఆటల పోటీలలో ఆడటం సంతోషకరమైన విషయమని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరాచారి, లక్ష్మీ ప్రియ, గౌరీ శంకర్, పి ఈ టి జగన్ ,సురేష్ కుమార్, రాంబాబు, రాము, చక్రి ,గిరీష్ నాయుడు, కుమారి ప్రవీణ, నిరూపమా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### -ఎ ఓ నాగం సుధామాధురి

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 29:** పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. మంగళవారం కిర్లంపూడి మండలం సోమవారం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ ఓ సుధా మాధురి మాట్లాడుతూ ప్రస్తుతం నాట్లు వేస్తున్నందున నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. నాట్లు వేసేటప్పుడు ప్రతి రైతు మోనలు తుంచి నాటుకోవాల్సిందిగా రైతులను తెలియజేసారు. ఈ సందర్భంగా గట్ల మీద వేసుకోవడానికి రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేసారు. కౌలు కార్డులతోపాటు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గ్రామంలో ఉన్న సి జి జి బ్యాంకులో



సందర్శించి కౌలు రైతులుకు కౌలు రుణాలు ఇవ్వాలని ఇన్సూరెన్స్ ఎన్రోల్మెంట్ చేయాలని బ్యాంకు మేనేజర్ ను అడిగారు. ఈ కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులు జంపన రవి వర్మ, జ్యోతుల కోటి , మంచికంటి శ్రీను, సూతి శ్రీను,పేపకాయల బుజ్జి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, ఆకుల సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు లింగేశ్వర్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

## మోకన భారత్‌కు రూ.25,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

### వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా అందజేత



**కాజులూరు, పెన్ పవర్,జూలై 29:** తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మోకన శ్రీనివాస్,మేరిల కుమారుడు మోకన భారత్ కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.25,000 చెక్కు ను అందజేశారు. ఈ చెక్కును కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి , సత్యం ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా మోకన కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు క్లస్టర్ ఇంచార్జ్,సలాది సాయిబాబు, మోకన వాడపల్లి, నీటి సంఘం అధ్యక్షులు సలాది శ్రీనివాసరావు సమక్షంలో చెక్కును మోకన శ్రీనివాస్‌కు అందజేశారు . మంత్రికి, ఫౌండేషన్ సభ్యులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అండగా నిలుస్తున్నదని, అవసరమైన వారికి సకాలంలో సహాయపడేలా చర్యలు తీసుకుంటున్నదని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

# బాయ్ ఫ్రెండ్ ని కిడ్నాప్ చేయించిన గర్ల్ ఫ్రెండ్... డిమాండ్ తెలిస్తే షాకే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రియుడి కోసం కట్టుకున్న భర్తలకు కడతేర్చుతున్న భార్యలకు సంబంధించిన ఘటనలు వరుసగా హల్ చల్ చేస్తోన్న వేళ.. తాజాగా డబ్బుల కోసం బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించి, చిత్ర హింసలకు గురించేసి, అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసి పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేసిన గర్ల్ ఫ్రెండ్ వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. ఈ స్క్రిప్ట్ మామూలుగా లేదనే మాటలు వినిపిస్తున్నాయి.అవును... డబ్బు కోసం ఓ మహిళ తన బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. దుబాయ్ కు చెందిన ఓ ట్రావెల్ సంస్థకు మేనేజర్ గా పని చేస్తున్న లారెన్స్ మెల్విన్ ను అతడి గర్ల్ ఫ్రెండ్ మహిమావత్ ఇటీవల బెంగళూరులో కిడ్నాప్ చేయించింది. అనంతరం రూ. 2.5 కోట్లు డిమాండ్ చేసింది. దీంతో... అతడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

వివరాళ్లోకి వెళ్తే... దుబాయ్ కు చెందిన ట్రావెల్ సంస్థలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న లారెన్స్ మెల్విన్ (37).. ఇటీవల తన కుటుంబ సభ్యులు నివసిస్తున్న బెంగళూరుకు వచ్చారు. ఈ క్రమంలో... జులై 16 నుంచి తమ కుమారుడు కనిపించట్లేదని లారెన్స్ తల్లి అశోక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో... కిడ్నాపర్లు ఫోన్ చేసి రూ. 2.5 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు!

దీంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. అతడి గర్ల్ ఫ్రెండ్ ఈ కిడ్నాప్ కు పథకాన్ని రచించిందని గుర్తించారు. ఈ సందర్భంగా... సెలవుపై దుబాయ్ నుంచి బెంగళూరు వచ్చిన లారెన్స్.. రెసిడెన్సీ రోడ్ లోని ఒక హెూటల్ లో బస చేశారని.. ఈ క్రమంలో జులై 14న అతడి ప్రియురాలు మహిమా బయటకు వెళ్దామని ఆహ్వానించడంతో ఓ కారు బుక్ చేసుకొని వెళ్లారని పోలీసులు తెలిపారు.

ఈ సమయంలో... కొంతదూరం వెళ్లిన తర్వాత, డ్రైవర్ కారును మరో మార్గంలో తీసుకువెళ్లగా అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు కారులోకి ఎక్కి లారెన్స్ పై దాడి చేశారని.. అతడి వద్ద ఉన్న రూ.లక్ష నగదు లాక్కొని ఓ అపార్ట్ మెంట్ లో బంధించారని తెలిపారు. ఈ క్రమంలో సుమారు వారం రోజులకు పైగా అతడిని చిత్రహింసలకు గురి చేసినట్లు వెల్లడించారు.అనంతరం.. అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసిన దుండగులు.. రూ. 2.5 కోట్లు డిమాండ్ చేశారని.. అయితే, అదే అపార్ట్‌మెంట్ లో ఉంటున్న ఓ మహిళ నిందితుల తీరు అనుమానాస్పదంగా ఉండడం గమనించి.. వారు లేని సమయంలో బాధితుడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించిందని తెలిపారు.ఆ సమాచారంతో స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారెన్స్ ను రక్షించారు. ఈ క్రమంలో.. ఆర్‌టి నగర్ కు చెందిన మహ్మద్ ఆసిఫ్ రిసల్దార్ (42), మహ్మద్ సోహైల్ షేక్ (25), డిజె హళ్లికి చెందిన సల్మాన్ పాషా (22), కెజి హళ్లికి చెందిన మహ్మద్ నవాజ్ (27) లను అదుపులోకి తీసుకోగా... మహిమా సహా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# 11 లక్షల మంది మహిళల ప్రైవేట్ చాట్ లీక్... ఏమిటీ యాప్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** పురుషుల గురించిన సమాచారాన్ని పంచుకోవడానికి, మహిళలకు సురక్షితమైన స్థలాన్ని అందించడానికి ఉద్దేశించినట్లు చెప్పే "టీ" డేటింగ్ యాప్ మరో తీవ్రమైన డేటా ఉల్లంఘనకు గురైందనే విషయం తాజాగా సంచలనంగా మారింది! తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక నివేదిక ప్రకారం.. సుమారు 11 లక్షల మంది మహిళలకు సంబంధించిన అత్యంత వ్యక్తిగత మెసేజ్ లు, సెల్ఫీలు ఆన్ లైన్ లో బహిర్గతమయ్యాయి.

అవును... మహిళలు తమకు నచ్చిన విషయాలు షేర్ చేసుకునేలా రూపొందించిన టీ డేటింగ్ యాప్ లో గోప్యతా ఉల్లంఘనలు బయటపడ్డాయని తెలుస్తోంది. ఈ సందర్భంగా... 11 లక్షల మంది యూజర్ల మధ్య జరిగిన ప్రైవేటు మెసేజ్ లు ఆన్ లైన్ లో ప్రత్యక్షమయ్యాయని ఓ మీడియా కథనం పేర్కొంది. వాటిలో అత్యంత వ్యక్తిగతమైన, మరింత సున్నితమైన సమాచారం ఉందని ఆ కథనం వెల్లడించింది.

ఈ సందర్భంగా... తాజా ఉల్లంఘనల్లో 2023 నుంచి ఉన్న మెసేజ్ లు కూడా ఉన్నాయని ఆ కథనం పేర్కొగా.. అందులో కొందరు మహిళలు అబార్షన్, రిలేషన్ షిప్ సమస్యలను చర్చించుకున్నారని తెలిపింది. ఇక... ఈ యాప్ లో నకిలీ పేర్లు వాడే వెసులుబాటు ఉన్నప్పటికీ.. చాలామంది యూజర్లు తమ గుర్తింపు తెలియజేసే వివరాలను ఉపయోగించారని అంటున్నారు.దానికి ప్రధాన కారణం.. తమ పర్సనల్ ఇష్యూస్ గోప్యంగా ఉంటాయని నమ్మడమే అని అంటున్నారు. ప్రస్తుతం టీ యాప్ కు 16 లక్షల మంది యూజర్లు ఉండగా... మహిళలు మాత్రమే ఈ యాప్ లో చేరేలా వారి సెల్ఫీలతో కన్ ఫాం చేసుకుంటారు. ఈ ఫీచర్ వల్లే మహిళలు దీనిపై ప్రత్యేకంగా ఆకర్షితులయ్యారని చెబుతారు.అయితే... వరుసగా జరిగిన గోప్యతా ఉల్లంఘనల వల్ల యూజర్ల సమాచారాన్ని భద్రపరిచే సామర్థ్యంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో... ఈ సమస్యను కనుగొన్న సైబర్ సెక్యూరిటీ పరిశోధకురాలు కస్రా రహ్జెర్డి.. యాప్ లో వినియోగదారుల పేర్లు ఇప్పటికీ యాక్టివ్ గా ఉన్నాయని నిర్ధారించింది.ఈ నేపథ్యంలో.. ఈ వ్యవహారాలపై 'టీ' నిర్వాహకులు స్పందించారు. ఈ సందర్భంగా... ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలను ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు. ఇదే సమయంలో... సైబర్ సెక్యూరిటీ నిపుణులతోనూ తాము విచారణ చేయిస్తున్నామని.. అలాగే భద్రతా సంస్థలు జరిపే దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు.

# నాగ పంచమి రోజు మాత్రమే తెరుచుకునే ఉజ్జయిని శ్రీ నాగ చంద్రేశ్వర ఆలయం





**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశం.. దేవాలయాలకు.. పుణ్య క్షేత్రాలకు ప్రసిద్ధి. ప్రతి దేవాలయానికి ఒక చరిత్ర ఉంది. సాధారణంగా భారతదేశంలోని గుళ్లలో నిత్యం పూజలు చేస్తారు. కాని మధ్య ప్రదేశ్? లోని ఓ దేవాలయం మాత్రం ఏడాదికి ఒక్కరోజే తెరుస్తారు. శ్రావణమాసంశుక్ల పక్షం పంచమి తిథి రోజున అంటే నాగ పంచమి రోజు తెరిచి ఘనంగా నాగేంద్రస్వామికి ఘనంగా పూజలు చేస్తారు.. ఏడాదిలో ఒక్కరోజే ఓపెన్? చేసే దేవాలయం గురించి ఇప్పుడు తెలుసుకుందాం. . .

మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని శ్రీ నాగ చంద్రేశ్వర ఆలయం ఏడాదిలో ఒక్కరోజే మాత్రమే తెరుస్తారు. నాగుల పంచమికి ముందు రోజు రాత్రి 12 గంటలకు తెరిచి, పంచమి రోజు రాత్రి 12 గంటలకు మూసివేస్తారు. శేషతల్పంపై శివపార్వతులు ఉన్న ఏకైక ఆలయమిది. ఆలయంలో పాములు సంచరిస్తాయని, తక్షకుడు ఇక్కడ తపస్సు చేశాడని భక్తుల నమ్మకం. ఈ ఏడాది జులై 29న అంటే నేడు నాగులపంచమి సందర్భంగా నాగచంద్రేశ్వర ఆలయాన్ని భక్తుల దర్శనార్థం తెరిచారు.దేశవ్యాప్తంగా నాగ పంచమి పండుగను ఈ రోజు ( జులై 29) ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అలయాలను దర్శించుకుని పుట్టలో పాలు పోస్తూ పూజలు చేశారు. నాగ పంచమి రోజును పురస్కరించుకుని ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ ఆలయం తెరుచుకుంది. ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ ఆలయం తలుపులు తెరుచుకుంటాయి. అది కూడా శ్రావణ మాసంలో వచ్చే నాగ పంచమి రోజు మాత్రమే. అందుకే ఈ ఏడాది నాగ పంచమికి ముందు అంటే ఈ ఏడాది జులై 28 వ తేదీ అర్థరాత్రి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నాగదేవతను దర్శించుకునేందుకు క్యూలైన్లలో నిలబడి పూజలు చేశారు. మళ్లీ ఈ రోజు (జులై 29) అర్దరాత్రి 12 గంటలకు మూసేస్తారు. నాగ పంచమి నాడు నాగదేవతను పూజించడం వల్ల పాముకాటు భయం ఉండదని, జీవితంలోని కష్టాలన్నీ తొలగిపోతాయని నమ్మకం. ఈ రోజున ( జులై 29) వాసుకి, మణిభద్ర, కాళిక, ధనంజయ, తక్షకుడు, కర్కోటకుడు మొదలైన వారిని పూజించే సంప్రదాయం ఉంది.

దేశంలోనే ప్రత్యేకమైన ఈ ఆలయ తలుపులు నాగ పంచమి రోజున సంవత్సరానికి ఒకసారి మాత్రమే తెరుచుకుంటాయి. అటువంటి పరిస్థితిలో ప్రతి సంవత్సరం నాగ పంచమికి ఒక రోజు ముందు అర్ధరాత్రి నుండి ఆలయాన్ని సందర్శించడానికి ప్రజలు క్యూ కడతారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహాకాళేశ్వర ఆలయంలో నాగపంచమి రోజున నాగచంద్రేశ్వరుని దర్శనం చాలా ప్రత్యేకమైనది.

జ్యోతిర్లింగాలలో ఒకటైన మహాకాళ ఆలయ సముదాయంలో చాలా పురాతనమైన నాగచంద్రేశ్వరుని ఆలయం ఉంది. ఈ ఆలయంలో పాముపై కూర్చున్న శివ-పార్వతి విగ్రహం చాలా అరుదైనది. ఆలయంలోని నాగచంద్రేశ్వరుని విగ్రహాన్ని దర్శించి పూజించడం ద్వారా శివపార్వతులిద్దరూ సంతోషిస్తారని, పాముల భయం నుండి విముక్తి లభిస్తుందని నమ్ముతారు.

## శేషనాగుపై శివపార్వతులు

సాధారణంగా విష్ణుమూర్తి శేషనాగుపై శయనిస్తాడు. కానీ ఇక్కడ మాత్రం శివపార్వతులు శేషనాగు మీద శయనిస్తారు. వీరితో పాటు వినాయకుడు కూడా ఉంటాడు. ఈ విగ్రహం చాలా పురాతమైనది. ఇలాంటి విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదు. నాగులకు రాజుగా భావించే తక్షకుడు ఈ ఆలయంలో నివసిస్తున్నాడని భక్తులు విశ్వసిస్తారు.

నాగపంచమి రోజు ఈ ఆలయాన్ని దర్శించుకోవడం వల్ల అన్ని దోషాలు తొలగిపోతాయని నమ్మకం. ఈ ఆలయాన్ని దర్శించుకున్న వారికి కాలసర్ప దోషం తొలగిపోతుందని పండితులు చెబుతున్నారు. ఈ ఒక్కరోజు మాత్రమే ఆలయం తెరిచి ఉంటుంది. . ఇక్కడ స్వామి వారిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం మాత్రమే ఉండటం వల్ల భక్తులు లక్షల్లో వస్తారు. ఈఏడాది జులై 28 న అర్ధరాత్రి పూజలు చేసి ఆలయ తలుపులు తెరిచారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులందరూ పాల్గొన్నారు. తలుపులు తెరిచిన అనంతరం నాగచంద్రేశ్వరునికి విధివిధానాల ప్రకారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈరోజు ( జులై 29) ప్రజలు ఈ ఆలయంలో రోజంతా నాగచంద్రేశ్వరుని దర్శనం చేసుకుంటారు.

## దేవాలయ చరిత్ర

పురాతన కాలంలో ఈ ప్రదేశాన్ని మహాకాళ వన అని పిలిచేవారు. తక్షకుడు అనే నాగు ఇక్కడ తపస్సు చేశాడని నమ్ముతారు. నేటికీ నాగచంద్ర దేవాలయంలో తక్షక్ నాగ్ నివసిస్తున్నాడని నమ్ముతారు. ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత కూడా ఉంది. ఇక్కడ సందర్శిస్తే కాలసర్ప దోషం అశుభ ప్రభావాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

# సిగరెట్ తెచ్చివ్వలేదు.. అందుకే గొడవ- కల్పిక!



**హైదరాబాద్ పెన్ పవర్:** కల్పిక.. హీరోయిన్ ఫ్రెండ్ తరహా పాత్రలతో ఒక మోస్తరుగా గుర్తింపు తెచ్చుకున్న నటి. ప్రయాణం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు లాంటి చిత్రాలు ఆమెకు పేరు తెచ్చిపెట్టాయి. ఐతే సినిమాల్లో వచ్చిన గుర్తింపు కంటే.. సోషల్ మీడియా ద్వారా ఆమెకు వచ్చిన పాపులారిటీనే ఎక్కువ. తరచుగా ఏదో ఒక వివాదంతో ఆమె వార్తల్లోకి వస్తుంటుంది. గతంలో తమిళ నటి ధన్య బాలకృష్ణన్‌తో కొన్ని రోజుల పాటు సోషల్ మీడియా ద్వారా తీవ్ర స్థాయిలో ఘర్షణకు దిగడం తెలిసిందే.ఇక ఈ మధ్య ఒక పబ్బులో నానా రచ్చ చేయడంతో కల్పిక పేరు మార్మోగింది. దీనికి సంబంధించి కేసు కూడా అయింది. ఆ గొడవ కాస్త సద్దుమణిగింది అనుకునే లోపే.. కల్పిక ఇప్పుడు కొత్త వివాదంతో వార్తల్లోకి ఎక్కింది. హైదరాబాద్ శివార్లలోని ఒక రిసార్టులో సిబ్బందితో ఆమె గొడవ పడుతున్న సీసీటీవీ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కల్పికకు ఎప్పుడూ ఇదే పనా అంటూ.. నెటిజన్లు ఆమె మీద ఫైర్ అయ్యారు. దీంతో ఆమె ఈ గొడవ గురించి ఒక వీడియో ద్వారా వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది.తన తల్లిదండ్రులతో కలిసి ఇటీవల బ్రౌన్ టౌన్ అనే రిసార్టుకు వెళ్లామని.. అది సిటీకి కొంచెం దూరంగా ఉంటుందని.. ధర తక్కువ అని దాన్ని బుక్ చేశామని.. కానీ అక్కడ సిగ్నల్స్ లేక, వైఫై లేక చాలా ఇబ్బంది పడ్డామని కల్పిక వెల్లడించింది. తన గదిని ఖాళీ చేసి.. అక్కడి నుంచి దూరంగా ఉన్న రిసెప్షన్‌కు వచ్చాక చెక్ ఔట్ చేసే సమయంలో బిల్లు కట్టడంలో ఇబ్బంది తలెత్తిందని ఆమె చెప్పింది. బిల్లు కోసం సిబ్బంది తొందర పెట్టారని.. జీపే ద్వారా బిల్లు చెల్లించానని కల్పిక వెల్లడించింది.క్యాబ్ బుక్ చేసుకుందామన్నా వైఫై పని చేయలేదని.. తమను డ్రాప్ చేయమని అడిగితే రిసార్ట్ సిబ్బంది దురుసుగా మాట్లాడారని ఆమె చెప్పింది. అప్పటికి వాతావరణం చాలా చల్లగా ఉండడంతో తనకు సిగరెట్ తాగాలి అనిపించిందని.. కానీ తన సిగరెట్ ప్యాకెట్ తన గదిలో ఉండిపోయిందని.. దాన్ని తెచ్చి ఇవ్వమంటే స్టాఫ్ తెచ్చి ఇవ్వలేదని.. ఇంతకుముందు ఏ రిసార్ట్‌లోనూ ఇలా జరగలేదని.. వాళ్లు తన సిగరెట్ ప్యాకెట్ తెచ్చి ఇవ్వనందుకు కోపం వచ్చిందని ఆమె చెప్పింది. ఎంత నిదానంగా చెప్పాలని చూసినా వినకపోవడంతో మేనేజర్‌తో గొడవకు దిగాల్సి వచ్చిందని కల్పిక వివరణ ఇచ్చింది.


# బాయ్ ఫ్రెండ్ ని కిడ్నాప్ చేయించిన గర్ల్ ఫ్రెండ్... డిమాండ్ తెలిస్తే షాకే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రియుడి కోసం కట్టుకున్న భర్తలకు కడతేర్చుతున్న భార్యలకు సంబంధించిన ఘటనలు వరుసగా హల్ చల్ చేస్తోన్న వేళ.. తాజాగా డబ్బుల కోసం బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించి, చిత్ర హింసలకు గురించేసి, అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసి పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేసిన గర్ల్ ఫ్రెండ్ వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. ఈ స్క్రిప్ట్ మామూలుగా లేదనే మాటలు వినిపిస్తున్నాయి.

అవును... డబ్బు కోసం ఓ మహిళ తన బాయ్ ఫ్రెండ్ ను కిడ్నాప్ చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. దుబాయ్ కు చెందిన ఓ ట్రావెల్ సంస్థకు మేనేజర్ గా పని చేస్తున్న లారెన్స్ మెల్విన్ ను అతడి గర్ల్ ఫ్రెండ్ మహిమావత్ ఇటీవల బెంగళూరులో కిడ్నాప్ చేయించింది. అనంతరం రూ. 2.5 కోట్లు డిమాండ్ చేసింది. దీంతో... అతడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

వివరాళ్లోకి వెళ్తే... దుబాయ్ కు చెందిన ట్రావెల్ సంస్థలో మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న లారెన్స్ మెల్విన్ (37).. ఇటీవల తన కుటుంబ సభ్యులు నివసిస్తున్న బెంగళూరుకు వచ్చారు. ఈ క్రమంలో... జులై 16 నుంచి తమ కుమారుడు కనిపించట్లేదని లారెన్స్ తల్లి అశోక్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో... కిడ్నాపర్లు ఫోన్ చేసి రూ. 2.5 కోట్లు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు!

దీంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. అతడి గర్ల్ ఫ్రెండ్ ఈ కిడ్నాప్ కు పథకాన్ని రచించిందని గుర్తించారు. ఈ సందర్భంగా... సెలవుపై దుబాయ్ నుంచి బెంగళూరు వచ్చిన లారెన్స్.. రెసిడెన్సీ రోడ్ లోని ఒక హెూటల్ లో బస చేశారని.. ఈ క్రమంలో జులై 14న అతడి ప్రియురాలు మహిమా బయటకు వెళ్దామని ఆహ్వానించడంతో ఓ కారు బుక్ చేసుకొని వెళ్లారని పోలీసులు తెలిపారు.

ఈ సమయంలో... కొంతదూరం వెళ్లిన తర్వాత, డ్రైవర్ కారును మరో మార్గంలో తీసుకువెళ్లగా అక్కడ మరో ఇద్దరు వ్యక్తులు కారులోకి ఎక్కి లారెన్స్ పై దాడి చేశారని.. అతడి వద్ద ఉన్న రూ.లక్ష నగదు లాక్కొని ఓ అపార్ట్ మెంట్ లో బంధించారని తెలిపారు. ఈ క్రమంలో సుమారు వారం రోజులకు పైగా అతడిని చిత్రహింసలకు గురి చేసినట్లు వెల్లడించారు.అనంతరం.. అతడి కుటుంబ సభ్యులకు కాల్ చేసిన దుండగులు.. రూ. 2.5 కోట్లు డిమాండ్ చేశారని.. అయితే, అదే అపార్ట్‌మెంట్ లో ఉంటున్న ఓ మహిళ నిందితుల తీరు అనుమానాస్పదంగా ఉండడం గమనించి.. వారు లేని సమయంలో బాధితుడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించిందని తెలిపారు. ఆ సమాచారంతో స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారెన్స్ ను రక్షించారు. ఈ క్రమంలో.. ఆర్‌టి నగర్ కు చెందిన మహ్మద్ ఆసిఫ్ రిసల్దార్ (42), మహ్మద్ సోహైల్ షేక్ (25), డిజె హళ్లికి చెందిన సల్మాన్ పాషా (22), కెజి హళ్లికి చెందిన మహ్మద్ నవాజ్ (27) లను అదుపులోకి తీసుకోగా... మహిమా సహా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.






మౌని రాయ్ ఇన్‌స్టాగ్రామ్ లో తన కొత్త ఆదివారం పోస్ట్‌లో మెరుస్తోంది

# పిరియాడిక్ లవ్ స్టోరీ.. హీరో ఒక్కడే..?

మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ సొంత భాషలో కెరీర్ ఎలా ఉందో కానీ తెలుగులో మాత్రం స్టార్ ఛాన్స్ లతో అదరగొట్టేస్తున్నాడు. దుల్కర్ సినిమా అంటే చాలు తెలుగులో సూపర్ హిట్ అనే బలమైన సెంటిమెంట్ ఏర్పరచుకున్నాడు. మహానటిలో జెమిని గణేషన్ రోల్ కి దుల్కర్ ని చూసి మెచ్చిన తెలుగు ఆడియన్స్ వరుసగా అతని సినిమాలను ఆదరిస్తున్నారు. మహానటి తర్వాత సీతారామం, ఆ తర్వాత లక్కీ భాస్కర్ ఇలా వరుస హిట్లు పడ్డాయి.

**మహానటి కోసం దుల్కర్..**

ముఖ్యంగా వెరైటీ కథ అది కూడా పీరియాడికల్ మూవీ ఐతే దానికి దుల్కర్ ని తీసుకుంటున్నారు. మహానటిలో ఐతే జెమిని గణేశన్ కోసం దుల్కర్ ని తీసుకున్నారు. సీతారామంలో మాత్రం హను తెలుగు హీరో ఒకరిని అనుకున్నా అది సెట్ అవ్వక దుల్కర్ చేశాడు. ఆ సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఇక లక్కీ భాస్కర్ కూడా ఒకప్పటి కథలానే చెప్పారు.

ఐతే తెలుగు మేకర్స్ దుల్కర్ తో పీరియాడికల్ కథలే చేస్తున్నాడు. పీరియాడికల్ లవ్ స్టోరీస్, ఇంకా ఒకప్పటి కథలు ఐతే చాలు అది దుల్కర్ తోనే చేయాలని ఫిక్స్ అవుతున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ కాంత సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా కూడా పీరియాడికల్ మూవీగానే వస్తుందట. ఈ మూవీలో రానా కూడా నటిస్తున్నాడు. భాగ్య శ్రీ బోర్స్ హీరోయిన్ గా నటిస్తుంది.

**పాపులారిటీతో కెరీర్ బిజీ..**

దుల్కర్ టేకప్ చేశాడు కాబట్టి కచ్చితంగా సినిమా సంథింగ్ స్పెషల్ అనేలా ఉంటుంది. కాంత తో పాటు దుల్కర్ సొంత భాష మలయాళంలో మరో రెండు సినిమాలు చేస్తున్నాడు. మొత్తానికి తెలుగులో దుల్కర్ కి వచ్చిన ఈ పాపులారిటీ అతని కెరీర్ ని బిజీ చేశాయి. ఎంతగా అంటే సొంత భాషలో సినిమా తీసే టైం లేకుండేలా చేశాయి. దుల్కర్ రానున్న సినిమాలు కూడా ప్రేక్షకులను అలరించేలా ఉంటాయని అనిపిస్తుంది. కాంతా సినిమా భాగ్య శ్రీ కోసం ఇద్దరు హీరోల మధ్య ఫైట్ జరిగేలా ఉంది. దుల్కర్ కి ఈ సినిమా కూడా హిట్ పడితే ఇక అతని రేంజ్ వేరేలా ఉంటుంది. కాంత ఎలా ఉంటుంది.. దుల్కర్ మరోసారి ఎలాంటి కథతో ఆడియన్స్ ముందుకొస్తున్నాడు అన్నది చూడాలి. అతను హీరోగా అనుకుంటే చాలు పీరియాడికల్ మూవీనే అవుతుంది. అది అలా కావాలని జరగకపోయినా ఈ కోఇన్సిడెన్స్ ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది.



సారా గుర్పాల్ తన ప్రకాశవంతమైన వైబ్‌తో మన హృదయాల్లోకి జారిపోయింది

# 89 పరుగులు చేస్తే 89 ఏళ్ళ రికార్డ్ బద్దలు: బ్రాడ్‌మాన్ అల్‌టైం రికార్డ్‌పై గిల్ గురి



ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ అదరగొడుతున్నాడు. తొలి నాలుగు టెస్టుల్లోనే నాలుగు సెంచరీలు తన ఖాతాలో వేసుకున్నాడు. 8 ఇన్నింగ్స్‌లలో 90.25 సగటుతో 722 పరుగులు చేసి ఈ సిరీస్ లో టాప్ రన్ స్కోరర్ గా నిలిచాడు. ఒక్క లార్డ్స్ టెస్టులో మినహాయిస్తే ప్రతి టెస్టులోనూ పరుగుల వరద పారించాడు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇంగ్లాండ్ తో మరో టెస్ట్ ఆడాల్సి ఉంది. గురువారం (జూలై 31) లండన్ లోని ఓవల్ లో వేదికగా చివరి టెస్ట్ జరగనుంది. ఈ మ్యాచ్ కు ముందు గిల్ బ్రాడ్ మాన్, గవాస్కర్ రికార్డులపై కన్నేశాడు. టెస్ట్ కెప్టెన్ గా గిల్ ఒక అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. గిల్ ఐదో టెస్టులో మరో 89 పరుగులు చేస్తే కెప్టెన్ గా తొలి సిరీస్ లోనే అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ గా రికార్డు సృష్టిస్తాడు. ఇప్పటివరకు ఈ రికార్డ్ బ్రాడ్‌మాన్ పేరిట ఉంది. 1936-37లో ఇంగ్లాండ్‌పై 810 పరుగులు సాధించిన బ్రాడ్ మాన్ ఒకే టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ గా నిలిచాడు. 89 ఏళ్లుగా ఈ రికార్డ్ బ్రాడ్‌మాన్ పేరిట ఉంది. గిల్ ప్రస్తుతం ఉన్న ఫామ్ కు రెండు ఇన్నింగ్స్ ల్లో 89 పరుగులు చేయడం కష్టం కాకపోవచ్చు.

ఇంగ్లాండ్ తో నాలుగో టెస్ట్ లో సెంచరీ కొట్టిన గిల్.. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే సిరీస్‌లో నాలుగు సెంచరీలు సాధించిన మూడో మూడవ కెప్టెన్‌గా నిలిచి అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గతంలో ఈ ఘనత ఇద్దరు ఆటగాళ్లు మాత్రమే సాధించారు. ఆస్ట్రేలియా ఆల్ టైం బెస్ట్ టెస్ట్ బ్యాటర్ సర్ డాన్ బ్రాడ్‌మాన్ (1947/48), టీమిండియా దిగ్గజ సునీల్ గవాస్కర్ (1978/79) మాత్రమే కెప్టెన్ గా ఒకే సిరీస్ లో నాలుగు సెంచరీలు కొట్టారు. తాజాగా గిల్ నాలుగు సెంచరీలతో వీరి రికార్డ్ సమం చేశాడు. ఈ సిరీస్ లో మరో టెస్ట్ ఉండడంతో చివరి టెస్టులో గిల్ సెంచరీ కొడితే ఒకే టెస్ట్ సిరీస్ లో ఐదు సెంచరీలు చేసిన తొలి కెప్టెన్ గా చరిత్ర సృష్టిస్తాడు.

# ఆట చివర్లో బ్రూక్ తో బౌలింగ్ చేయించడంపై స్టోక్స్ వివరణ

## డ్రాగా ముగిసిన ఓల్డ్ ట్రాఫర్డ్ టెస్టు
## అద్భుత పోరాటం కనబర్చిన టీమిండియా
## చివర్లో నిర్లక్ష్యంగా బంతులు విసిరిన బ్రూక్
## టీమిండియా అభిమానుల ఆగ్రహం



టెస్టు క్రికెట్ చరిత్రలోనే అద్భుత పోరాటం అనదగ్గ రీతిలో ఓల్డ్ ట్రాఫర్డ్ లో టీమిండియా ఆటగాళ్లు అద్వితీయమైన స్ఫూర్తి కనబర్చారు. తద్వారా, ఓటమి తప్పదనుకున్న టెస్టును డ్రాగా ముగించి, సిరీస్ సమం చేసే ఆశలను సజీవంగా నిలుపుకున్నారు. అయితే, నిన్న ఐదో రోజు ఆట చివర్లో టీమిండియా బ్యాటర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ సెంచరీలకు చేరువలో ఉండగా... ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తమ ప్రధాన బౌలర్లను పక్కనబెట్టి హ్యారీ బ్రూక్ ను బౌలింగ్ కు దించడం విమర్శలకు దారితీసింది. దీనిపై స్టోక్స్ వివరణ ఇచ్చాడు. తమ జట్టుకు గెలుపు అవకాశాలు కనిపించినంత వరకు ప్రధాన బౌలర్లతోనే ఓవర్లు వేయించామని, ఇక డ్రా తప్పదని తేలినప్పుడు వారిపై ఇంకా భారం మోపడం సరికాదనిపించిందని అన్నాడు. అందుకే, పార్ట్ టైమ్ బౌలర్ బ్రూక్ కు బంతి ఇచ్చానని తెలిపాడు. ఇక, మ్యాచ్ ముగిసేందుకు మరో గంట సమయం ఉన్నప్పటికీ... జడేజా, సుందర్ లకు తాను షేక్ హ్యాండ్ ఇచ్చే ప్రయత్నాన్ని కూడా స్టోక్స్ సమర్థించుకున్నాడు. ఇక మ్యాచ్ లో ఫలితం తేలే అవకాశం లేనప్పుడు డ్రా ప్రతిపాదనతో షేక్ హ్యాండ్ ఇవ్వడం సాధారణమైన విషయం అని అన్నాడు. కానీ తన ప్రతిపాదనకు అంగీకరించలేదని, దాంతో, తమ మెయిన్ బౌలర్లకు విశ్రాంతి ఇచ్చి బ్రూక్ తో బౌలింగ్ చేయించానని వివరించాడు. అయితే, బ్రూక్ ఎంతో నిర్లక్ష్యంగా స్లో ఫుల్ టాస్ లు వేయడం, కొట్టుకోండి అన్నట్టు బౌలింగ్ చేయడం భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. దీనిపైనా స్టోక్స్ స్పందించాడు. బౌలింగ్ చేసేటప్పుడు చెత్త పనులు చేయొద్దు... కొత్తగా ఏమీ ట్రై చేయాల్సిన అవసరం లేదు అని బ్రూక్ కు చెప్పానని వెల్లడించాడు.

# చదరంగంలో యువ రాణి దివ్య దేశ్‌ముఖ్.. ఫిడే వరల్డ్ కప్ విజేత సక్సెస్ స్టోరీ



చెస్ బోర్డుపై పట్టు, చదువులోనూ అంతే శ్రద్ధ. అకడమిక్స్, ఆటను అద్భుతంగా సమన్వయం చేసుకుంటూ దేశ చెస్ యవనికపై ఓ నవతార ఉదయించింది. కేవలం 19 ఏండ్లకే ఫిడే వరల్డ్ కప్ గెలిచి చెస్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకుంది నాగ్‌పూర్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్. 24 రోజుల పాటు సాగిన ఈ టోర్నమెంట్ అసలేమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన దివ్య ఒక్కో ఎత్తుతో ప్రత్యర్థులకు చెమటలు పుట్టిస్తూ.. ఆఖరాటలో దేశ తొలి మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపిను ఓడించి ఒక్కసారిగా అసాధారణ విజేతగా మారింది. డాక్టర్ల ఫ్యామిలీలో పుట్టిన దివ్య స్కెతస్కోప్ కాకుండా చెస్ బోర్డు పట్టుకొని ఈ ఆటలో ఇప్పుడు యువ రాణి అయింది. తన అమ్మనాన్న ఇద్దరూ డాక్టర్లే అయినా.. అక్క షట్లర్ అయినా.. తనను చెస్ బోర్డులోని పావులే ఎక్కువగా ఆకర్షించాయి. చిన్నతనం నుంచే ఆమె చదువుతో పాటు ఆటలోనూ అసాధారణ ప్రతిభ కనబరిచింది. పదేండ్లకే నేషనల్ చాంపియన్‌గా నిలిచిన దివ్య ఇంటర్నేషనల్ ఈవెంట్ల కోసం ప్రపంచమంతా చుట్టివచ్చినా తన చదువును ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. హెూటల్ గదుల్లో, విమాన ప్రయాణాల్లో, ఆటల విరామ సమయంలో హెూంవర్క్ పూర్తిచేసేది. రెగ్యులర్ టెన్త్, ప్లస్2లో డిస్టింక్షన్‌లో పాసైన దివ్య డిస్టెన్స్ డిగ్రీలో తన ఆటకు పనికొచ్చేలా స్పోర్ట్స్ సైకాలజీ, పెర్ఫామెన్స్ సైన్స్, డాటా ఎనలిటిక్స్ సబ్జెక్టులు ఎంచుకుంది.

**చెస్‌లో ధోనీ..**

సూపర్ టాలెంటెడ్ అయిన దివ్య ప్రధాన అస్త్రం ప్రశాంతత. ఎంతటి క్లిష్ట సమయంలోనైనా ఓపిగ్గా, ప్రశాంతంగా ఆడటం ఇండియా క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్. ధోనీని గుర్తుకు తెస్తుందని దివ్య మాజీ కోచ్, గ్రాండ్‌మాస్టర్ శ్రీనాథ్ నారాయణన్ అంటున్నాడు. 'దివ్య దూకుడుగా ఆడే ప్లేయర్. కానీ కాలంతో పాటు తన ఆటను మరింత మెరుగుపరుచుకుంది. క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్.. ఇలా అన్ని ఫార్మాట్లలోనూ ఆమె రాణిస్తుంది. అత్యంత కీలకమైన, ఒత్తిడితో కూడిన క్షణాల్లో ఆమె అసలైన సత్తా బయటపడుతుంది. క్రికెట్‌లో చివరి ఓవర్లలో ధోనీ ఎలా మ్యాచ్‌లను గెలిపిస్తాడో, టై-బ్రేక్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో దివ్య కూడా అలాంటి అద్భుతాలనే చేస్తుంది' అని కొనియాడాడు. 2020 ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో గోల్డ్ నెగ్గిన ఇండియా తరఫున బరిలోకి దిగిన దివ్య.. చైనా, రష్యా వంటి బలమైన జట్లపై కీలక విజయాలు సాధించిపెట్టి వరల్డ్ చెస్‌లో తన రాకను ఘనంగా చాటింది. 2021లో విమెన్ గ్రాండ్ మాస్టర్ హెూదా సాధించిన ఆమె రెండేండ్లు తిరిగేసరికి 2023 ఆసియా విమెన్స్ చాంపియన్ అయింది. గతేడాది వరల్డ్ అండర్20 చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం చేసుకున్న దివ్య.. బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం గెలిచిన ఇండియా విమెన్స్ టీమ్‌లో దివ్య కీలక మెంబర్. గత నెలలో లండన్‌లో జరిగిన వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ చెస్ చాంపియన్‌లో వరల్డ్ నంబర్ వన్ హౌ యిఫాన్‌ను ఓడించింది. తాజా టోర్నీలో 15వ సీడ్‌గా బరిలోకి దిగినప్పటికీ అద్భుతమైన ఎత్తులతో, మేటి ప్లేయర్లను ఓడించి ఆశ్చర్యపరిచింది. నాలుగో రౌండ్‌లో రెండో సీడ్ జు జినర్, క్వార్టర్ ఫైనల్లో పదో సీడ్ హారిక, సెమీస్‌లో మూడో సీడ్ టాన్ జోంగ్యి పై గెలిచిన ఈ టీనేజర్ చివరకు కోనేరు హంపికు చెక్ పెట్టిన తీరు అద్భుతం. తను ఇదే జోరును కొనసాగిస్తే.. ఇంకో రెండు, మూడేండ్లలో వరల్డ్ చాంపియన్ అయినా ఆశ్చర్యం లేదు. ఏదేమైనా 19 ఏండ్ల దివ్య దేశ్‌ముఖ్ జర్నీ కేవలం ఒక విజయం మాత్రమే కాదు. కొత్త తరానికి స్ఫూర్తినిచ్చే విజయగాథ. చదువును నిర్లక్ష్యం చేయకుండానే ఆటలో శిఖరాలను ఎలా అధిరోహించవచ్చో దివ్య చూపిస్తోంది. ఓవైపు వరల్డ్ చాంపియన్ గుకేశ్?తో పాటు ఎరిగైసి అర్జున్, ప్రజ్ఞానంద వంటి కుర్రాళ్లు దూసుకెళ్తుండగా.. అమ్మాయిల్లో హంపి తర్వాత ఆ స్థాయికి చేరే సత్తా తనకుందని ఈ విజయంతో దివ్య చెప్పకనే చెప్పింది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com